Vol. I
No.

18th January, 1983.
(Tuesday)
28 Paush, 1904 S. E.

# THE ANDHRA PRADESH
# Legislative Assembly Debates

## OFFICIAL REPORT

CONTENTS

| | PAGES. |
|---|---|
| Oath or Affirmation. | .. 45 |
| Election of Speaker. | .. 45 |
| Announcement: | |
| re: Resignation from Tirupathi constituency Sri N.T. Rama Rao and Yemmiganur constituenuy-Sri K. Vijaya Bhaskara Reddy. | .. 70 |
| re: Constitution of Business Advisory Committee. | .. 70 |

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.
1983

THE

ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

PRINCIPAL OFFICERS

Sri T. Satyanarayana.

# THE
# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES
## OFFICIAL REPORT

Second Day of the First Session of the Seventh Andhra Pradesh Legislative Assembly

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Tuesday the 18th January, 1983.

The House met at Half-past Ten of the Clock.

(Sri K. Narayana Swamy, Speaker, Pro tem in the Chair)

### OATH OF AFFIRMATION.

The following member was sworn in—

Smt. M. Swarajyam Thungathurthi :—

### ELECTION OF SPEAKER

మిస్టర్ స్పీకర్ ప్రో టెం :—స్పీకర్ ఎన్నికకు సంబంధించి శ్రీ తంగి సత్యనారాయణ పేర మూడు నామినేషన్లు దాఖలు చేయబడ్డాయి. ఒక నామినేషనులో శ్రీ తంగి సత్యనారాయణ పేరును ప్రతిపాదించిన వారు శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి. రెండవ నామినేషనులో శ్రీ ఎన్. భాస్కర రావు ప్రతిపాదకులు. మూడవ నామినేషనులో శ్రీ పి. మహేంద్రనాథ్ ప్రతిపాదకులు. మూడు నామినేషన్లలో ఒకే పేరు ప్రతిపాదించబడినందున వేరే నామినేషన్లు ఏవీ రానందున శ్రీ తంగి సత్యనారాయణ స్పీకర్ గా ఎన్నిక అయినట్లు ప్రకటించుచున్నాను. శ్రీ తంగి సత్యనారాయణగారికి నా హృదయపూర్వకమైన అభినందనలు తెలుపుతున్నాను. వారు సభాపతి స్థానాన్ని అలంకరించాలని కోరుతూ ప్రోటెం స్పీకర్ గా నాకు ఈ అవకాశం కలిగించినందుకు నా విధి నిర్వహణలో మీరందరూ సహకరించినందుకు కృతజ్ఞత తెలియచేస్తున్నాను.

(ముఖ్యమంత్రి ఇతర రాజకీయ పక్ష నాయకులు శ్రీ తంగి సత్యనారాయణను అధ్యక్ష స్థానానికి సగౌరవంగా తీసుకువచ్చి ఆసీనులను కావించిరి.)

---

*An asterisk before the name indicates confirmation by the Member.

ముఖ్యమంత్రి (శ్రీ ఎన్. టి. రామారావు) :—అధ్యక్షా, సహచరులకు సోదర సోదరీ మణులకు నిన్నటి నుంచి ఏడవ శాసన సభ సమావేశం ప్రారంభమైన సంగతి తెలిసినదే. తాత్కాలిక సభాపతిగా శ్రీ కాటూరి నారాయణస్వామి గారు అధ్యక్షత వహించి నిన్నటి సమావేశంలో సభ్యుల పదవీ స్వీకార కార్యక్రమాన్ని నేడు తమ ఎన్నిక కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడం కూడా జరిగింది. శ్రీ నారాయణ స్వామి గారు చాలా హుందాతో నిండుతనంతో తమ కర్తవ్యాన్ని నిర్వహించి సభా మర్యాదకు వారు అలంకరించిన పదవికి వన్నె తెచ్చారు. వారు ఎంతో అద్భుతమైన నిపుణతతో గౌరవ భావంతో ఆ పదవికి వన్నె చేకూర్చినందుకు వారికి సభా పక్షాన హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రజాస్వామ్యం అంటే రాజకీయ పక్షాలు, శాసన సభ మనకు గుర్తుకు వస్తాయి. శాసన సభ అనగానే సభాధ్యక్షులు ఎవరు అని అడుగుతారు అందరూ. మహారాజుకు కిరీటం ఎటువంటిదో శాసన సభకు అధ్యక్షులుగా ఉన్న వారు అటువంటి హుందాను కలిగించే వారు, గౌరవాన్ని కలిగించేవారు. వన్నె చేకూర్చేవారు అనే అవగాహన అందరిలో ఉంది. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత ఉత్కృష్టమైనది కూడా. ప్రాచీన కాలంలో ఆంగ్ల దేశమందు అయన ప్రజలకు రాజులకు మధ్య ఒక సంధాన కర్తగా వారికీ వీరికీ సమన్వయం చేకూర్చే ఒక వ్యక్తిగా శక్తిగా వ్యవహరిస్తూ ఉండేవారు. కనుక వారికి పాలనా యంత్రాంగంలో మకుట స్థానం ఇవ్వడం జరిగింది. అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం కూడా జరిగింది. శాసన సభలోని సభ్యులు ఏ రాజకీయ పక్షాలకు చెందిన వారైనప్పటికి వారందరి హక్కులను పరిరక్షించే గురుతరమైన బాధ్యత వారి మీద ఉంది. ప్రజాస్వామిక సంస్థల పైన వాటి సిద్ధాంతాలపైన ప్రజలకు విశ్వాసం కలిగించే, గౌరవాన్ని ఇనుమడింపచేసే మహత్తర బాధ్యత వారిపై ఉంది. మీరు ఈ ఉన్నతమైన పదవికి ఎన్నిక కావడం మా అందరికీ సంతోష కారణం. 1967-72 కాలంలో ఐదు సంవత్సరాలు శాసన సభ్యులుగా మీ విధ్యుక్త ధర్మాన్ని అతి సమర్థవంతంగా నిర్వహించిన సంగతి, ప్రజాస్వామ్య విధానాలను గౌరవించిన సంగతి, ప్రజలకు సేవ చేసిన సంగతి అందరికీ తెలిసినదే. మీ అనుభవం మీ సమయ స్ఫూర్తి సహృదయతతో కూడిన మీ భావాలు అభ్యుదయకరమైన ఉత్కృష్టమైన మీ భావనలు సౌమ్యమైన ఆలోచనలు నిష్పక్షపాత వైఖరి అత్యంత క్లిష్టమైన ఈ బాధ్యతను, కర్తవ్యాన్ని నిర్వహించడానికి పరిపూర్ణమైన దోహదం కలిగిస్తాయని మీరు అందుకు సమర్థులని నేను పరిపూర్ణంగా విశ్వశిస్తున్నాను. మీ ఆధ్వర్యంలో మేమందరం ఎటువంటి సమస్యలు లేకుండా వ్యవహరించగలమని మాకు పరిపూర్ణమైన విశ్వాసం, నమ్మకం ఉంది. ఈ సందర్భంలో మా రాజకీయ పక్షం నుంచి శాసన సభ పక్షంగాను మీకు హృదయపూర్వకమైన అభినందనలు తెలియచేసుకుంటున్నాను.

డా. వై. ఎస్. రాజశేఖరరెడ్డి (పులివెందల) :—అధ్యక్షా, నూతనంగా ఎన్నిక అయిన సభాధ్యక్షులకు సుస్వాగతం చెబుతూ తమరు ఇంతకు ముందు ఐదు సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉంటూ శాసన సభా కార్యక్రమాలలో చాలా

చరుగ్గా పాల్గొన్న విషయాన్ని గుర్తు చేస్తూ రాబోయే శాసన సభా సమావేశాల్లో మీరు పరిపూర్ణమైన విశ్వాసంతో కేవలం ఒకపక్షం సభ్యులకే అవకాశం ఇవ్వడం కాకుండా ప్రతిపక్షం వారికి కూడా అవకాశాలు ఇచ్చి శాసన సభ హుందాతనాన్ని నిర్వాహిస్తారని సభాపతిగా ఎటువంటి తేడా ఎవరియెడల చూపరని మేము నమ్ముతున్నాము. ఇంతకు ముందు ఎందరో మహానుభావులు ఈ పదవిని అలంకరించారు. ఎంతోమంది ఈ పదవికి అలంకారం తెచ్చారు. వారందరికంటే మీరు ఏ విధంగా తీసిపోకుండా మీ కార్యక్రమ నిర్వహణలో ప్రతిపక్షం, పాలక పక్షం అనే వ్యత్యాసాలు చూపకుండా మాకు ఇవ్వవలసిన స్వేచ్ఛ ఇస్తూ ఇటు శాసన సభకు అటు ప్రభుత్వానికి ప్రజలందరికీ నచ్చే విధంగా వ్యవహరిస్తారని ఆశిస్తూ మీకు కాంగ్రెసు-(ఐ) శాసన సభ్యుల పక్షాన పరిపూర్ణమైన సహకారాన్ని ఇస్తామని హామీ ఇస్తూ మీకు అభినందనలు తెలియచేస్తున్నాను.

వర్క్స్ శాఖమంత్రి (శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి) :—అధ్యక్షా, నా బాల్య స్నేహితుడు ఈ నాడు పీఠాధిపతి ఐనందుకు నేను మురిసిపోతున్నాను అని మనవిచేస్తున్నాను. ఒకసారి జ్ఞాపకం చేసుకుంటున్నాను-మనం ఇద్దరం వాల్తేరులో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్రం అభ్యసించాము. ఆ నాడు కూడా యువకులకు ఉత్సాహం కలిగించి ప్రోత్సహించి మంచి మార్గాన నడిపించిన మిత్రులు మీరు. స్పీకరు పదవి ముళ్ళ కిరీటం వంటిది, ఇటీజ్ నాట్ ఎ బెడ్ ఆఫ్ రోజెస్ అని మనవిచేస్తున్నాను. ప్రతి ఒక్కరు, సామాన్య ప్రజానీకం అంతా, స్పీకరు అంటే దివి నుంచి భువికి దిగి వచ్చిన వ్యక్తి అనే సాంప్రదాయం ఉంది. అది కాదని రూపించుకోనవలసిన బాధ్యత తమపైన వుందని మనవి చేస్తున్నాను. స్పీకరు పదవిని గ్రామస్థులదగ్గరకు తీసుకపోవాలని మిమ్ములను అర్ధిస్తున్నాను. సామాన్యప్రజలకు అందుబాటులో వుంటూ వారి కష్టసుఖాలను అర్ధము చేసుకొని ప్రజలకు, ప్రభుత్వానికి ఒక లైజానుగా వ్యవహరిస్తే బాగుంటుందని మనవిచేస్తున్నాను. ఈ సభలో సత్సంప్రదాయాలను నెలకొల్పాలని ప్రభుత్వ పక్షము, ప్రతిపక్షాన్ని రెండు కళ్లుమాదరి చూసుకోవాలని, పెద్దలు కాశీశ్వర రావుగారు, పిడతల రంగారెడ్డిగారు, బి. వి. సుబ్బారెడ్డి వంటివారు నెలకొల్పిన మహత్తరమైన, మహోత్కృష్టమైన సాంప్రదాయాలను పాటించి సభ హుందాతనమును, సభా గౌరవాన్ని కాపాడాలని అర్ధిస్తూ శలవు తీసుకొంటున్నాను.

شری سلطان صلاح الدین اویسی :— اسپیکر صاحب آپ کے متفقہ انتخاب پر میں میری جانب سے اور میری پارٹی کی جانب سے مبارکباد پیش کرتا ہوں اور اس توقع کا اظہار کرتا ہوں کہ آپ اپنے پیشرو شری کلا وینکٹ راو۔ شری بی۔ وی سبا ریڈی اور شری ایشور ریڈی قائم کردہ روایات کو برقرار رکھینگے ۔ آندھراپردیش میں ایک سیاسی انقلاب آیا اور آپ تشریف لائے یہ بڑی خوشی کی بات ہے ۔ یہ بات واضع ہوجاتی ہے کہ اقتدار دائمی نہیں ہوتا بلکہ

اقتدار ایک ایسی چیز ہے جو ہمیشہ آتا جاتا رہتا ہے - مجھے توقع ہے کہ آپ اس بات کو محسوس کرینگے کہ خصوصاً یہاں اقلیتوں کے ساتھ پورا پورا انصاف ہونا چاہئے - کیونکہ جس ملک کی اقلیتیں مطمئین ہوں وہ ملک ہی ترقی کرسکتا ہے - یہاں گمبھیر مسائل ہیں ان کو آپ پوری حل کرنے کی کوشش کرینگے - میں آپ کو یقین دلانا چاہتا ہوں کہ میری پارٹی کی جانب سے آپ کے ساتھ پورا تعاون کیا جائیگا - میں پھر ایک مرتبہ آپ کو مبارکباد دیتا ہوں -

శ్రీ ఎం. ఓంకార్ (నరసంపేట):—అధ్యక్షా, తెలుగు దేశము పార్టీ మొదటిసారిగా అధికారం లోకి రావడము, ఆ సందర్భములో మీరు తొలి స్పీకరుగా ఎన్నుకోబడ్డము, ఈ శుభ సమయములో మా పార్టీ తరఫున తమకు మా హృదయపూర్వక శుభాకాంక్షలను అందచేస్తున్నాను. అధ్యక్షస్థానము ఔన్నత్యముగురించి సభానాయకులు ఇంతకుముందు చెప్పివున్నారు. గతములో ఈ సభలో మీరు సభ్యులుగా వున్నారు. కనుక దీని ప్రాముఖ్యతను నేను ప్రత్యేకించి చెప్పవలసిన పని లేదు. గత 35 సంవత్సరాలుగా ఏకచ్ఛత్రాధిపత్యముగా పాలించిన కాంగ్రెస్ పార్టీప్రతిపక్షస్థానాన్ని ఆక్రమించటము, అధికార పక్షముగా వచ్చిన తెలుగు దేశం పార్టీకి మూడింట రెండు వంతుల మెజారిటీ రావడం జరిగింది. ప్రతిపక్షము ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూ తన బాధ్యతలను నెరవేర్చటానికి సభాధ్యక్షుల సహకారము చాలా అవసరము. ఈ సందర్భములో సభాధ్యక్షులు పాలకపక్షమును, ప్రతిపక్షమును రెండు కళ్లు వలె చూడవలసినదే కాని ఏమానముగా చూడవలసినది కాదు, వెయిటేజీ ప్రతిపక్షానికి యివ్వవలసిన అవసరము, ధర్మము మీ పైన వుంది. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్న సందర్భములో, వాటిని ఏదో ఒక రూలు ఆధారముగా సభ దృష్టికి తీసుకువస్తున్నపుడు అవి టెక్నికల్‌గా రూల్స్‌కి లోబడి వున్నవా లేదా అని చూడక ఆ సమస్యల ప్రాముఖ్యతనుబట్టి అనుమతి యిచ్చి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే విధంగా చూడవలసిన బాధ్యత మీ మీద వుంటుందని మనవిచేస్తున్నాను. పాలకపక్షమువారికి ఒక విషయమును మనవిచేస్తున్నాను. జనతా పార్టీ కేంద్రములో అధికారానికి వచ్చినపుడు ఒక సత్సంప్రదాయాన్ని నెలకొల్పినది. ప్రతిపక్షనాయకునికి కాబినెట్ మినిష్టరు హోదాను యివ్వడముతోబాటు ఉపాధ్యక్ష పదవిని ప్రతిపక్షమువారికి యివ్వడం జరిగింది. 1978లో ఎన్నికలు జరిగిన తరువాత కాంగ్రెసుపార్టీవారు ఈ సంప్రదాయాన్ని అంగీకరించారు. ఆ తరువాత జనతాపార్టీలో ఏదో చీలికలు వచ్చాయని ఆ సత్సంప్రదాయాన్ని మంటగలిపారు. ప్రతిపక్షాలవారు వివిధ గ్రూపులుగా వున్నప్పటికి ఉపాధ్యక్ష పదవి మాకు యివ్వండి, మాలో ఎవరినో ఒకరిని ఏర్పాటు చేసుకొంటాము, ప్రతిపక్షానికి వచ్చే ఈ పదవిని లాగుకోవడము మంచిది కాదని చెప్పాము. ఆ నాడు పాలకపక్షానికి మెజారిటీ వుందనే అహంభావముతో కనీస పార్లమెంటరీ సత్సంప్రదాయాన్ని కాలరాచారు. ఇప్పుడు అటువంటి పనిని ఈ పాలక పక్షము చేయకూడదని మనవిచేస్తున్నాను.

ఉపాధ్యక్ష పదవిని ప్రతిపక్షానికి యిచ్చినందువలన పాలకపక్షము హుందాతనము పెరుగుతుంది కాని వారి నిత్య వ్యవహారములలో ఏరకమైన ఆటంకము వుండదు. జనతాపార్టీ ప్రవేశపెట్టిన, అన్ని పక్షాలవారు ఆమోదించి హర్షించిన సత్సంప్రదాయాన్ని పాలకపక్షమువారు కూడ పాటించాలని కోరుతూ, మీ విధి నిర్వహణలో మా పార్టీ సహకారము పూర్తిగా వుంటుందని మనవిచేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ రజబలి (సుజాతానగర్):— అధ్యక్షా, మీరు నాకు చిరకాల పరిచితులు. 1967 లో మాతోపాటు యిక్కడ మీరుకూడ సభ్యునిగా వుండేవారు. అనేక కమిటీలలో కలిసి పని చేశాము. మీరు సభాధ్యక్షునిగా ఏకగ్రీవముగా ఎనికైనందుకు మా సి. పి. ఐ. తరఫున శుభాకాంక్షలను అంద జేస్తున్నాను. గౌరవ సభ్యులందరూ చెప్పినట్లు మీరు ఉన్నతస్థానమును అలంకరించారు. ఇక్కడ ప్రతిపక్షాలవారము వున్నాము. ప్రజా సమస్యలు ఎన్నో వస్తూవుంటాయి. చాలా కాలము తరువాత ఒక రకమైన కొత్త మార్పు యిక్కడ వుండడం జరుగుతున్నది. సభాకార్యక్రమాలను నిష్పక్షపాతముగా నిర్వర్తించే సందర్భములో ఈ విషయాన్ని ప్రస్తావించదలచుకొన్నాను. ఈ 4,5 రోజుల సమావేశము కాలములో ప్రశ్నోత్తరాల సమయాన్ని తగ్గించడం జరిగింది. అది మంచి సంప్రదాయము కాదు. ఎన్ని హక్కులను హరించటానికి ప్రాసెస్ జరుగుతున్నదో తెలియదు. ప్రశ్నోత్తరాలు వుంటే కొత్తగా ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి ఎన్. టి. రామారావుగారి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే అవకాశము వుండేది. పాత సంప్రదాయాలకు అంతరాయము కలుగకుండా మీ హయాములో సభాకార్యక్రమాలను నిర్వహించాలని కోరుతూ మా కమ్యూనిస్టు పార్టీ తరఫున మరల శుభాకాంక్షలను తెలియచేస్తున్నాను.

శ్రీ ఎమ్. వెంకయ్యనాయుడు (ఉదయగిరి):— గౌరవనీయ అధ్యక్షా, ఈ ఏడవ శాసనసభా సమావేశంలో మీరు ఏకగ్రీవంగా ఈ శాసనసభకు అధ్యక్షులుగా ఎన్నిక అయినందుకు భారతీయ జనతాపార్టీ తరఫున హృదయ పూర్వకంగా నా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. ఈనాడు ఏర్పడిన నూతన పరిస్థితులలో, నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత, ఒక కొత్త మార్పు వచ్చిన తరువాత తమరు ఈ సభకు సభాపతిగా ఎన్నికయ్యారు. కనుక ఈనాటి వరకూ సభను నిర్వహించిన సభాపతులకంటే తమరి బాధ్యత అధికమయినదని నేను గుర్తు చేస్తున్నాను. దానికి కారణం అటు అధికార పక్షంలో వున్న సభ్యులలో అధిక సంఖ్యాకులు ఈ సభకు కొత్తవారు. మొదటిసారిగా శాసనసభా ప్రాంగణంలో అడుగు పెడుతున్నవారు. ఇటు ప్రతిపక్షంలో కూర్చున్న వారిలో ప్రతిపక్షనాయకులకు తప్ప మిగిలినవారిలో చాలామందికి ప్రతిపక్షంలో కూర్చునే అలవాటు లేదు. వారికి ప్రతిపక్షం కొత్త, ఈ ప్రభుత్వం కొత్త.

శ్రీ ఎన్. యతిరాజారావు (చెన్నూరు):— మేము చాలాసార్లు ఇటువైపు కూర్చున్నాము.

శ్రీ ఎమ్. వెంకయ్యనాయుడు:— నేనువారి అనుభవాన్ని తక్కువ అంచనా వేయడం లేదు. నేను వేరే ఉద్దేశ్యంతో చెప్పడం లేదు. కొత్తగా ఒక పార్టీకి

అవకాశం లభించిన నూతన పరిస్థితిలో అనుభవం తక్కువగా వున్నవారు అధిక సంఖ్యలో అన్ని పక్షాలనుండి ఎన్నికయినవారు వచ్చిన ఈ సందర్భంలో తమపై గురుతరమైన బాధ్యత అధికమైందని నేను గుర్తు చేస్తున్నాను. గత శాసన సభలో నేను సభ్యుడిగా వచ్చినప్పుడు కొత్తవాడిని. కొన్ని విషయాలు తెలుసుకోటానికి ప్రయత్నించాను. ఇంకా నేర్చుకోవలసిన విషయాలు కూడా వున్నాయి. నేనిప్పుడు చెప్పదలచుకున్నది ఏమిటంటే—ఈ శాసనసభలను ఏదో ఒక తంతుగా జరిపించడం దేశవ్యాప్తంగా మొదలైంది. ఏదో జరగాలి కాబట్టి జరుపుదాం, ఈ బిల్లు పాస్ కావాలి కాబట్టి పెడదాం అనే ఆలోచన ప్రజాస్వామ్యంలో మంచి లక్షణం కాదు. ఈ సభలో ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల విస్తృతంగా, విపులంగా చర్చలు జరగాలని కోరుతున్నాను. అధ్యక్షా, గత శాసనసభలో మీరు లేరు. ఆనాడు అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాల విషయాలపై సరైన చర్చ జరగటానికి అవకాశం లేకుండా పోయింది. ఈనాడైనా తమరి నాయకత్వం క్రింద ఈ శాసనసభలో ప్రజా సంక్షేమాలకు సంబంధించిన అన్ని విషయాలపై వీలైనంత ఎక్కువ విస్తారమైన స్థాయిలో ఎక్కువ సమయం ఇచ్చి చర్చలు జరిగే అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతపు సమస్యలు, వ్యవసాయ సమస్యలకు ప్రాధాన్యం లభించేటట్లు చూడవలసివుంది. ఓంకార్ గారు చెప్పినట్లు అధ్యక్షా, తమరు ఇక ఎంపైర్ గా పని చేయవలసి వుంటుంది. సభాపతిగా ఎన్నికయిన మీరు ఫలానా పార్టీ అని మర్చిపోవలసివుంది. పార్టీ దృష్ట్యా ఆలోచిస్తే న్యాయం చేయలేమని అనిపిస్తున్నది. గత అనుభవాలు మాకు వున్నాయి కాని వాటినిగురించి ఇప్పుడు చెప్పడం మంచిది కాదు. ప్రతిపక్షంలో అనేక పార్టీలు వున్నాయి. అన్ని పక్షాల వారికి సరైన న్యాయం జరిగేటట్లు చూడవలసిన బాధ్యత తమ మీద వుంది. ఆ బాధ్యతను మీరు గుర్తించి అన్ని పక్షాల వారిని సమాన దృష్టితో చూడాలని మనవిచేస్తూ మరొకసారి మా పార్టీ తరఫున తమకు నా అభినందనలు అందచేస్తున్నాను.

శ్రీ ఎస్. జైపాల్ రెడ్డి (కల్వకుర్తి) :— అధ్యక్షా, ప్రప్రథమంగా ఈ పరిస్థితులలో తమకు ఏకగ్రీవంగా సభాపతిగా ఎన్నికయినందుకు నా హృదయ పూర్వక అభినందనలు తెలియచేసుకుంటున్నాను. ఈనాడు నాకు చాలా సంతోషంగా వుంది. ఎంతో కాలంగా పరిచయం వున్న మీరు సభాపతి కావడం నాకు సంతోషం, మీకు జ్ఞాపకం వుండి వుంటుంది. 1967–72 కాలంలో మీరు శాసనసభ్యులుగా వున్నప్పుడు నేను కూడా శాసనసభ్యునిగా వుండే అవకాశం లభించింది. అప్పటినుంచి ఇప్పటివరకూ మీరు సభలో వున్నా లేకపోయినా మన స్నేహం కొనసాగుతూనే వుంది. మన రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక నూతన పరిస్థితి ఈనాడు ఏర్పడింది. ఇదివరకు ఎప్పుడు రాజకీయ పక్షంగా లేకుండా, ఒక కొత్త పార్టీగా అవతరించిన పార్టీ నేడు అధికారంలోకి వచ్చింది. ఇదివరకు ఎప్పుడూ ప్రతిపక్షంగా వున్న అనుభవం లేని పార్టీ ఈనాడు ప్రధాన ప్రతిపక్షం అయింది. వారికి ప్రతిపక్షంలో వుండే అవకాశం లభించి నందుకు నాకు సంతోషంగావుంది. వారు ప్రతిపక్షస్థానానికి ఎప్పుడు వస్తారా అని

ఎన్నో సంవత్సరాలనుండి ప్రార్థిస్తూ వున్నాము. ఇప్పటికి ఆ కల సఫలం అయినందుకు సంతోషంగా వుంది.

శ్రీ సి.హెచ్. విజయరామరాజు (బాపట్ల) :—మీకు మాత్రం అధికార పక్షం వైపు వుండే అవకాశం లభించలేదు కదా.

శ్రీ ఎస్. జైపాల్ రెడ్డి :—ప్రతిపక్షంలో వుండి, ప్రధాన ప్రతిపక్షంగా వున్నవారు ఎలాంటి పాత్ర ఇక్కడ నిర్వహించాలో నేర్పే అవకాశం మాకు లభించినందుకు సంతోషంగా వుంది. పార్లమెంటరీ ప్రజా స్వామ్యానికి, అధ్యక్ష తరహా పాలనకు మౌలికమైన తారతమ్యం వుంది. పార్లమెంటరీ ప్రజా స్వామ్యంలో ప్రతిపక్షానికి కీలకమైన ప్రధాన పాత్ర వుంది. ఈ సభ విషయం చూస్తే ఇక్కడ సహజంగా ప్రతిపక్ష సభ్యుల పాత్ర ఎక్కువగా వుంటుంది. అటు వంటప్పుడు ఏ పాలకపక్షం వారు సభాపతిగా వున్నా వారు ప్రతిపక్ష సభ్యుల పట్ల పక్షపాతం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణ చేయడం అనువాయితీగా వస్తున్నదని నా అనుభవం. పాలక పక్షం వారెప్పుడూ సభాపతి ప్రతిపక్షాల పట్ల పక్షపాతం చూపిస్తున్నారని ఆరోపణలు చేస్తూ వుంటారు. ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై అజమా యిషి చేసే బాధ్యత, అవసరం వుంది. అందుచేత వాటి పాత్ర ఇక్కడ అధి కంగా వుంటుంది, ఇదివరకూ మాకు వున్న అనుభవం ఏమిటంటే ప్రభుత్వ బిల్లులు బడ్జెటు డిమాండులు శాసనసభలో పాస్ చేసుకుంటే ఈ సభా కార్యక్రమం పూర్తయినట్లే అని ప్రభుత్వ పక్షం ఆలోచించేది. గత పది సంవత్సరాల చరిత్ర చూస్తే ఈ శాసన సభలో స్థాయీ సంఘాల నివేదికలపైన సుదీర్ఘమైన చర్చలు జరగలేదు.

యీ శాసనసభ అనేది కేవలం ఏదో ఒక చట్టాన్ని వెంటనే ప్రభుత్వం 11-00 a m తలచుకుంది గనుక ఆమోదించాలని, లేకపోతే బడ్జెటు పాసు చేసుకుంటే సరిపో తుంది అంతకంటే వేరే పని లేదనే అభిప్రాయము ప్రభుత్వ పక్షానికి వుండేది. నూతన దృక్పథముతో అధికారములోకి వచ్చామని యిప్పుడున్న పాలకపక్షము చెబుతున్నది గాబట్టి ఆ వైఖరిలో మార్పు వస్తుందని అనుకుంటున్నాము. ఆ వైఖరిలో మార్పు వచ్చేటట్లు సముచితమైనటువంటి పాత్రతో వ్యవహరిస్తారనే విశ్వాసం వుంది. ఇప్పుడు ఓంకారు గారు చెప్పినట్లు ప్రతిపక్షం ప్రభుత్వ పక్ష మున్న, రెంటిని సమానంగా చూడాలనేది నిజం కాదు. ఎందుకంటే ప్రభుత్వ పక్ష వ్యవహార అంతును తేల్చడానికి ప్రతిపక్షమువుంది గాబట్టి వారికి శాసనసభలో ఎక్కువ అవకాశం యివ్వాలి. ఈ విషయాన్ని పాలకపక్షము, మీరు దృష్టిలో పెట్టుకొని నడుపుతారని ఆశిస్తూ మీరు సభాపతిగా ఎన్నిక అయినందుకు శుభా కాంక్షలు తెలుపుతూ నా సహకారం పరిపూర్ణంగా వుంటుందని హామీ యిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వసంత నాగేశ్వరరావు (నందిగామ) :—అధ్యక్షా, పార్లమెంటరి ప్రజా స్వామ్యములో అటు పార్లమెంటులో గాని యిటు శాసనసభల్లో గాని అధ్యక్షుడి ప్రాముఖ్యత చాలా వుంటుందని గత ౩౫ సంవత్సరాల పార్లమెంటరీ చరిత్ర

తెలుపుతున్న విషయం, ఇంతకుముందు మా మిత్రులు చెప్పినట్లుగా ప్రతిపక్షమే గాకుండా పాలక పక్షమును మూడింట రెండు వంతులు ఆంధ్ర దేశములో—తెలుగు దేశము పార్టీకి—మెజారిటి వుంది. ఏదో ప్రతిపక్షం అంటే జయపాల్ రెడ్డి గారిని వెంకయ్యనాయుడు గారన్నీ, వారివంకే చూడాలనేది గాకుండా రాష్ట్రములో అవినీతి అన్యాయానికి, అసమర్థతతో కూడిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు యిచ్చిన తీర్పు దృష్ట్యా వచ్చిన రెండువందల మంది సభ్యులు సభలో ఎక్కువగా మాట్లాడాలనే ఆకాంక్షతో వున్నారు గాబట్టి మావైపు కూడ చూడాలని కోరుతున్నాను. జయపాల్ రెడ్డి గారు వెంకయ్యనాయుడు గారు చెప్పే విషయాలే గాకుండా మా వారు కూడ ప్రజాస్వామ్యం పట్ల ప్రజల సమస్యల పట్ల తెలుగు దేశము పక్షాన మాట్లాడాలనే ఆదుర్దాతో వచ్చినటువంటి వారు ఎక్కువగా వున్నారు. వారికి అవకాశం యివ్వాలి. అదేరకంగా యీ విధాన సభలో అయ్యదేవర కాళేశ్వర రావు పంతులుగారు, బి. వి. సుబ్బారెడ్డి గారు, నీడతల రంగారెడ్డి గారు తదితర పెద్దలు పెట్టినటువంటి వరవడిని దృష్టిలో పెట్టుకొని రానున్న 5 సంవత్సరాలలో యీ శాసనసభలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సక్రమమైనటువంటి నూతనమైనటువంటి సాంప్రదాయాలతో ప్రజా సమస్యలను పరిష్కారం చేయడములో ఎక్కువ కాలాన్ని వినియోగించాలి. ప్రత్యేకించి యీ శాసనసభలో కొద్ది మంది ప్రతిపక్షాల వారు చేప్పేదే గాకుండా యివాళ రాష్ట్రములో వున్న సమస్యల పట్ల ఎక్కువ బాధ్యతను తీసుకొని తెలుగు దేశమువారు శాసనసభలో కృషి చేస్తారనే దృష్టితో ప్రజానీకం ఎక్కువ మద్దతును యిచ్చి మూడింట రెండు వంతుల సందిని ఎన్నుకున్నారు గాబట్టి వారి సమస్యలను సభ దృష్టికి తీసుకురావడానికి పాలక పక్షానికి ఎక్కువ అవకాశం యివ్వాలని ప్రార్థిస్తూ రానున్న కాలములో మీకు సుఖం జరుగాలని నా పక్షాన హృదయపూర్వకమైన అభినందనలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యం. వి. కృష్ణారావు (అవనిగడ్డ) :—అధ్యక్షా, నేడు తమరు శాసన సభ అధిపతులుగా ఏకగ్రీవంగా ఎన్నిక అయిన సందర్భములో హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. ఇదివరలో తాము శాసనసభలో సభ్యులుగా వున్నారు. అందరికి కూడ పాత మిత్రులే. అందులోను ప్రతిపక్షములో వుండి వ్యవహారం చేసినటువంటి వారు, వసంత నాగేశ్వరరావు గారు చెప్పినట్లు అందరికి అవకాశం యివ్వవలసిందే. ప్రతివారికి సమస్యలు వుండవచ్చు. అందరికి మాట్లాడాలనే కాంక్ష వుంటుంది. అయితే ప్రతిపక్షాలవారి సమస్యల ప్రాధాన్యతను గమనించవలసి వుంటుంది. ఈ సందర్భంగా సుహృద్భావము, సచ్ఛీలత కలిగిన మిమ్ములను శాసనసభ అధిపతిగా ఎన్నిక చేసిన సభా నాయకులు శ్రీ ఎన్. టి. రామారావు గారిని అభినందిస్తున్నాను. ఇందాక మిత్రులు చెప్పినట్లు యిదివరకున్న సాంప్రదాయం ప్రకారం డిప్యూటి స్పీకరు పదవిని ప్రతిపక్షాలవారికి యిచ్చే సాంప్రదాయాన్ని వారు ప్రవేశపెడుతారని ఆశిస్తూ మరొకసారి మీకు హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

Sri P. Ramachandra Reddy (Sangareddy):—Mr, Speaker Sir, on this auspicious occasion when you are elected as Speaker unanimously I extend my hearty congratulations and also promise to co-operate. In this House, I being an Independent Member and the Independents are the weakest people in the House, I hope from to-day when you cease to be a Member of any political party, you are the only leader and protector. This Chair was occupied continuously by eminent advocates and lawyers. When this community hall was converted into Assembly in Old Hyderadad State, Kasinath Vaidya who occupied this Chair was an eminent lawyer and subsequently after the formation of Andhra Pradesh Kaleswara Rao, B.V. Subba Reddy, R. Dasaradharama Reddy were all lawyers except Pidathala Ranga Reddy. It is a proud privilege to the professional community. I being a lawyer feel doubly happy. This Chair is being occupied by an eminent lawyer like you. I hope the legal knowledge you are having will help you in discharging your duties. In this House a large number of legislators are from Telugu Desam. Next to them is Congress (I). National Parties are having less number. I have no doubt that you will treat everybody and protect our rightful rights. I hope you will discharge your duties without fear or favour and I hope God would give you energy and strength to discharge your duties. Once again I request you to show some special concession to us as we are the weakest in this House.

I once again congratulate you and extend my co-operation. Traditionally Andhra Pradesh Legislature has always been keeping up the decorum, decency compared to other States. We must show an example to other State Assemblies. Inspite of excitements on important public issues we will maintain decorum and decency. I once again congratulate you and I promise we will co-operate with you.

శ్రీ సి.హెచ్. వెంకటరామజోగయ్య (నరసపూర్) :— అధ్యక్షా, శ్రీకాకుళం ప్రాక్టీసింగు లాయర్సు బార్ ఎసోసియేషన్ అధ్యక్షుడిగా వుండి యీ అధ్యక్ష స్థానానికి అన్ని అర్హతలు కలిగి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అందరికీ సంతోషంగా వుంది. తెలుగు దేశము పార్టీ తరఫున యీ రోజున ఎన్నిక కాబడిన 200 సభ్యులలో చాలా మంది కొత్తవారు అయినా, గ్రాడ్యుయేట్సు, పోస్టు గ్రాడ్యుయేట్సు, డాక్టర్సు మిగతా అన్ని అర్హతలు కలిగిన వారు వున్నారు. వారిపైన ప్రజలు ఏవైతే ఆశలు పెట్టుకున్నారో అవి అన్నీ కూడా సభా ముఖంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలనే ఆదుర్దా కలిగి వుండి యిక్కడికి రావడం జరిగింది. మేము ప్రభుత్వ పక్షము అయినా ప్రభుత్వ పక్షంగా ఎన్నికల్లో వస్తామని ఏనాడు వూహించుకోలేదు. అవసరం వస్తే ప్రతిపక్షముగా నిలబడి యీ రాష్ట్రములో ప్రజల అవసరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం ద్వారా సేవ చేయడానికి వస్తామనుకుంటే ప్రభుత్వ పక్షములో కూర్చున్నాము.

అయితే ఏ పరిస్థితులలోనైనా ప్రభుత్వ పక్షంగా వస్తామనే ఆశను పెట్టుకున్న కాంగ్రెస్‌వారు ఈ రోజున ప్రతిపక్షంగా వచ్చారు. వారు ఈ రోజున సభా ముఖంగా తీసుకుని రావలసినది లేదు. మా నాయకుడు శ్రీ ఎన్. టి. రామారావు ప్రజాస్వామ్యవాది. గతంలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించినట్లుగా—డిక్టేటరుగా కాకుండా. ప్రభుత్వ పక్షంలో ఉన్న మాకు మా సభా నాయకుడు ఈ సభాముఖంగా అన్ని విషయాలను తీసుకొని రావడానికి వీలు కల్పించారు. ప్రభుత్వ పక్షమైన మాకు కూడా ఎప్పుడూ ఎక్కువ అవకాశాలు కల్పించాలని కోరుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎస్. విజయరామ రాజు (నాగూరు) :—అధ్యక్షా, ఈ ఏడవ శాసన సభకు తమరు ఏకగ్రీవంగా ఎన్నిక అయినందుకు మా పార్టీ తరపున శుభాకాంక్షలు అందజేస్తున్నాను. శ్రీకాకుళం జిల్లాకు స్పీకరు పదవి దక్కడం ఇది మొదటిసారి కాదు. ఇంతకు ముందు శ్రీ రొక్కం లక్ష్మీనరసింహం దొరగారు ఒకసారి స్పీకరుగా ఎన్నికై ఈ పదవికి వన్నె తెచ్చారు. సభాగౌరవాన్ని కాపాడారు. మీరు కూడా ఆ ఒరవడి నిలబెడతారనడంలో ఎటువంటి సందేహం లేదు నాకన్నా ముందు మాట్లాడిన శ్రీ జైపాల్ రెడ్డిగారు, వెంకయ్యనాయుడుగారు మా పార్టీ మీద ఎంత కసి ఉందో తెలియజేసారు. మేము అపోజిషనులో కూర్చోవడం ఇది మొదటిసారి కాదు. 1978లో పార్లమెంటులో మేము అపోజిషనులో కూర్చొని జనతా పార్టీకి అధికారం అప్పగించాము. కాని వారు విఫలులైనారని మనవి చేస్తున్నాను. అధికార పార్టీ నాయకులు శ్రీ రామారావుగారు మాట్లాడుతూ సాంప్రదాయాలను నెలకొల్పుతామని అన్నారు. శ్రీ నీలం సంజీవరెడ్డిగారు లోక్‌సభ స్పీకరుగా ఎలక్టు అయినప్పుడు పార్టీకి రాజీనామా చేసారు నిష్పక్షపాతంగా వ్యవహరించడానికి. తమరు కూడా అదే ఒరవడిని నిలబెడతారని ఆశిస్తూ మరొకసారి తమకు అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను

శ్రీ బి. సమ్మయ్య (పరకాల) :—అధ్యక్షా. నూతన శాసనసభకు తమరు స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నికయినందుకు హృదయపూర్వక అభివందనములు తెలియజేస్తున్నాను, ఈనాడున్నటువంటి పరిస్థితులు తమకు తెలియనివి కావు. ఈనాడు అధికార పార్టీ అయిన తెలుగు దేశం పార్టీకి బలం ఉందనే ఆవేశంతో ఉద్రేకంతో ప్రతిపక్షాలవారు ప్రజలకు సంబంధించిన సమస్యలను సభలో తీసుకొని రావడానికి ప్రయత్నించినప్పుడు అడ్డగించే సందర్భంలో మీరు మాకు రక్షణగా ఉండవలసి ఉంటుంది, ఎటువంటి పక్షపాతం లేకుండా, ఎటువంటి అరమరికలు లేకుండా శాసనసభను హుందాగా నడుపవలసిన బాధ్యత మీమీద ఉంది. ఇంతకు ముందు ఉన్నటువంటి మంచి పేరును మీరు కొనసాగించి ఇంకా మంచి పేరు ప్రతిష్టలు గడించగలుగుతారనే విశ్వాసం నాకు ఉంది. ప్రజా సమస్యలను ప్రతిపక్షాలవారు ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావలసి ఉంటుంది కనుక ప్రతిపక్షాలవారికి ఎక్కువ సమయమును ఇవ్వవలసిన అవసరం ఎంతయిన ఉందని మనవి చేస్తున్నాను. బలహీన వర్గాలమీద జరిగే అత్యాచారాలు, అన్యాయాలు, అక్రమాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావలసి ఉంటుంది.

ఈ శాసనసభ ప్రజలయొక్క మనోభావాలకు అద్దం పట్టేటట్లు ఉండాలని మనవి చేస్తున్నాను. ప్రతిపక్షాలకు ఎక్కువ అవకాశం ఇచ్చి ప్రభుత్వంద్వారా ఆ సమస్యలను పరిష్కరించడానికి మీ సహాయసహకారాలు అవసరమని మనవి చేస్తున్నాను. ఇంతకుముందు ఉన్న ప్రతిపక్షాలలో ఒకరిద్దరు సభ్యులు ఉండేవారు. ఈనాడు ప్రతిపక్ష పార్టీ బాధ్యతలను నిర్వర్తించడానికి ఇందిరా కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రమూ తీసిపోదని మనవిచేస్తున్నాను. ఈనాడు ప్రజలు ఇచ్చినటువంటి తీర్పును గౌరవించడమే కాకుండా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటి కప్పుడు తీసుకొని రావలసిన బాధ్యత కూడా మామీద ఉంది. కనుక అందరినీ సమన్వయపరచి శాసనసభను హుందాతనంగా నడిపించడానికి మీరు కృషి చేయ గలరని, మాకు న్యాయాన్ని కలుగజేయగలరని ఆశిస్తున్నాను. న్యాయవాద వృత్తిలో ఉన్నటువంటి అనుభవాన్ని, శాసనసభ్యునిగా ఉన్నటువంటి అనుభవాన్ని మేళవింపజేసి ఈ శాసనసభకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకొని వస్తారని ఆశిస్తున్నాను. ఈ సందర్భంలో మా పార్టీ తరపున తమకు హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఇంద్రసేనారెడ్డి (మలక్‌పేట) :—అధ్యక్షా, 7వ శాసనసభకు తమరు శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నా హృదయపూర్వకమైన శుభా కాంక్షలు తెలియజేస్తున్నాను. అధికార పార్టీకి రెండింట మూడు వంతులు మెజారిటీ ఉంది కనుక తమకు కూడా ప్రజా సమస్యలు తెలియజేయడానికి ఎక్కువ అవకాశం ఇవ్వాలని అంటున్నారు. అయితే ఇంతకు ముందు కూడా పాలక పక్షంలో ఉన్నటువంటి వారు ఇదే రకంగా అధిక మెజారిటీలో ఉండి ఏ రకంగా చేసారో ఆ రకంగా ఈనాడు తెలుగుదేశ పార్టీ చేయకూడదని మనవి చేస్తున్నాను. అదేరకంగా తెలుగుదేశం పార్టీవారు చేస్తే వారికి పట్టినగతే రాబోయే కాలంలో పడుతుందని మనవిచేస్తున్నాను. వారి సమస్యలను వారి పార్టీ వారికి చెప్పి వచ్చును. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించవలసి ఉంది. కనుక ప్రతిపక్షాల వారికి ఎక్కువ అవకాశం ఇవ్వాలి. ఇక్కడ సీనియర్, జూనియర్ అనే సమస్య లేకుండా సభ్యులందరికీ మీరు సమా నావకాశాలు కలుగజేయాలని మనవి చేస్తున్నాను. మీరు ఆ స్థానంలో ఉండి సత్సాంప్రదాయాలను నెలకొల్పుతారని ఆశిస్తూ తమకు మరొకసారి శుభా కాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను. 11-20 a.m.

శ్రీ కొత్త రాజిరెడ్డి (హుజూరాబాద్) :—అధ్యక్షా, మీరు సభాపతిగా ఎన్నికైనందుకు మీకు ధన్యవాదాలు. ప్రతిపక్షం అని అధికార పక్షం అని మా మిత్రులు తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు. నేడు ప్రతిపక్షంగా ఉండి అప్పుడు అధికార పక్షంలో వారు ఉన్నప్పుడు వారు ప్రతిపక్షం వారిని ఏ విధంగా కించ పరచారో అదే విధంగా తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలో ఉండి ప్రతిపక్షంలో వున్న తమని కించపరుస్తుందేమో అనే బాధను వారు వెలిబుచ్చు కున్నారు. తెలుగుదేశం పార్టీ ఉద్భవించి 9 మాసాలు అయి ఎన్నికలలో అఖండ విజయం సాధించి ప్రభుత్వానికి వచ్చింది. తమరు 1967 లో శాసన సభ్యులుగా

వుండి ఇప్పుడు ఈ కొత్త శాసన సభకు సభాపతిగా క్రొత్తగా వచ్చారు. తెలుగు దేశంలో సభ్యులు శాసన సభ్యులుగా రావడం క్రొత్త. ఈ రాజ్‌రెడ్డి మీ ముందు మాట్లాడడం క్రొత్త. కాబట్టి అధికార పక్షం ప్రతిపక్షం అని భావించక ప్రతిపక్ష పార్టీకి చెందిన మా మిత్రులందరు ప్రజల సమస్యలను సభ ముందుకు తీసుకువచ్చి అందరు కలసికట్టుగా సమైక్యతతో ప్రజాసేవ చేస్తాము అనే సంతృప్తితో ఉండడం అందరి కర్తవ్యం. అధికార పక్షం అధిక సంఖ్యలో వుంది కాబట్టి ప్రతి పక్షాలను కించ పరుస్తుంది అనే భావన మా తెలుగు దేశం పట్ల ఉండనక్కరలేదు. తెలుగుదేశం పార్టీ ఉద్భవించి ఈ తొమ్మిది మాసాలలో తారకరామారావు గారి నాయకత్వంలో నమ్మకంతో ౩౫ సంవత్సరాల నుంచి ప్రభుత్వంలో వుండి ప్రజలలో రగుల్కొలిపిన అసంతృప్తిని ౩౫ సంవత్సరాల నుంచి ఉన్న ఆ చరిత్రను నామ రూపాలు లేకుండా గెంటివేసింది. ప్రజల సమస్యలను సభా దృష్టికి తేవడం మా కర్తవ్యం. ఒక్క సభకు చెందిన నాయకులే సమస్యలను సభా దృష్టికి తీసుకురావాలి అనే నిబంధనను ఈ నూతన పార్టీ గాని నూతన సభాపతి గాని పాటించి చేసినట్లయితే ఎంతో ఆశతో నమ్మకంతో మా సమస్యలను సభ ముందుకు తెస్తారు అనే ఉద్దేశంతో ఓట్లు వేసి గెలిపించిన సుమారు లక్ష మంది ప్రజలను కించపరచినట్లు అవుతుంది. ప్రజల కష్ట సుఖాలను చర్చించడం శాసన సభ కర్తవ్యం కావున ఈ వేళ ప్రతిపక్షం పార్టీకే ఎక్కువ సమయం ఇవ్వాలి అని ప్రతి పక్షం అధికార పక్షం తప్పులను ఎత్తి చూపుతూ పేపర్లలో లాంఛనంగా వేయడం వంటి జరుగుతున్న పద్ధతిని రూపుమాపాలని నేను కోరుతున్నాను. ప్రపంచ చరిత్రలోనే ఘనంగా తొమ్మిది మాసాల క్రితం ఉద్భవించిన తెలుగుదేశం పార్టీ పేరు పాతుకుపోయిన అధికార పార్టీని రూపులేకుండా చేసి ప్రజలలో ఒక ఉత్తేజం కలిగించింది. ప్రజా సమస్యలను ముందుకు తీసుకువచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపుకి నడిపిస్తుంది అనే నూతన ఉత్తేజాన్ని అందరిలోను చూడవలసిన బాధ్యత మా పైన ఉన్నది. అందుకొరకు ప్రతిపక్షం ఒకరి మీదనే ఆ బాధ్యత ఉన్నట్లు ఉన్న పరిమితి ఈ వేళ నుంచి తొలగిస్తారని నేను భావిస్తున్నాను. మా తెలుగుదేశం పార్టీలో డాక్టర్లు ఉన్నారు. ఉన్నత విద్యలు చదువుకున్న వారు ఉన్నారు. ప్రజలు వీరందరిని నమ్ముకున్నారు. ప్రజలు ఎన్. టి. రామారావుగారిని నమ్ముకున్నారు. ఈ పార్టీ వారు మా సమస్యలను తొలగిస్తారు. ౩౫ సంవత్సరాల నుంచి కలుగుతున్న బాధలను తొలగిస్తారని ఆశిస్తున్నారు. ప్రతి శాసన సభ్యుడు తమ యొక్క అమూల్య సలహాలను తమ ప్రజల యొక్క కోర్కెలను సభ ముందుకు తీసుకురావడానికి మా పార్టీ నాయకులు మాకు అనుమతి ఇస్తారని ఆశిస్తున్నాను. ప్రతి పక్షాలు దానికి వ్యతిరేకించవు అని నేను ఆశిస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎన్. వెంకటరత్నం (గుంటూరు-2) :- అధ్యక్షా, ఆరు కోట్ల తెలుగు ప్రజలు పూర్తిగా చరిత్రాత్మకమైన నిర్ణయాన్ని చేశారు. ఆ నిర్ణయం ప్రకారం ఆవిర్భవించింది మా పార్టీ ప్రభుత్వం. ప్రథమంగా ఏర్పాటైనా ఈ సభకు మీరు స్పీకరు అయినందుకు మా తరపున మీకు ధన్యవాదాలు తెల్పుకుంటున్నాను. ఇక్కడ ఇది ప్రభుత్వ పార్టీ, అది ప్రతిపక్ష పార్టీ అనేది పొరపాటు.

అటు కూర్చున్న వారిలో ఒకరే ప్రతిపక్షాలకు సంబంధించిన వారు. తక్కిన వారంతా కూడా మా ప్రభుత్వ పక్షంగానే మేము భావిస్తున్నాము. కారణం ఏమంటే 35 సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను తప్పించాలని ఆకాంక్ష ఉన్న వారంతా కూడా ఒకటే పార్టీ. కమ్యూనిస్టులు గాని, జనతా గాని మా తెలుగు దేశం పార్టీలో భాగస్వాములే. మా ప్రతిపక్షం కాంగ్రెస్ వారే. మిగతా వారు ప్రతి పక్షం అనుకోకుండా ప్రభుత్వ పక్షంతో సహకరించడం చాలా ఆరోగ్యకరమని మనవి చేస్తున్నాను.

శ్రీ ఎం. ఓంకార్ :—పాయింట్ ఆఫ్ క్లారిఫికేషన్. మేము అందరము ప్రభుత్వ పక్షంలో భాగస్వాములే అంటున్నారు. కాంగ్రెస్ పార్టీని ఓడించడంలోను, అదే మాదిరిగా కాంగ్రెస్ పార్టీ ఇంత వరకు చేసిన దుష్ట చర్యలను పెకలించి చేసే దానికి వారితో మేము భాగస్వాములమే. ప్రజల శ్రేయస్సు కొరకు వారు చేసే ప్రతి పనిలోనూ వారితో భాగస్వాములమే. కాని వారు దానిలో కొంచెము తప్పు చేసినా మా పార్టీ ఖచ్చితంగా వారికి ప్రతిపక్షమేనని మనవి చేస్తున్నాము.

శ్రీ ఎన్. వెంకటరత్నం :—వారు పార్టీ బలాన్ని బట్టి వెయిటేజి ఇవ్వాలని వారు అన్నారు. పూర్వ కాలంలో ప్రతిపక్షాలకు ఎక్కువ కాల వ్యవధి ఇచ్చిన మాట యదార్థమే. కాని ఇప్పుడు ఆ అవసరం లేదు. ఎందుకంటే కాంగ్రెస్ అధికారంలో ఉన్న రోజులలో వారికి ప్రజాసమస్యలను పట్టించుకోడానికి తీరిక ఉండేది కాదు. ప్రతి పక్షం వారు ఒకరే ఆ నాడు ప్రజల సమస్యలను టేకప్ చేసే వారు. ఈ ప్రభుత్వం వచ్చింది. మూడింట రెండు వంతులు ఉంది. మూడు వంతుల సమస్యలను తీసుకుని మూడు వంతులను ప్రతిబింబించవలసిన అవసరం మా పార్టీపైన ఉన్నది. మిగతా 1/3 వ వంతు సమస్యలు తీసుకురావడానికి వారికీ అవకాశం ఇవ్వవచ్చు. మాకు ప్రతిపక్షం కాంగ్రెస్ వారే. వారికి కాల వ్యవధి పెద్దగా ఇవ్వవలసిన అవసరం లేదు. ప్రజలకు సమస్యలను సృష్టించింది ఆ కాంగ్రెస్ పార్టీయే. దానికి వారు ఏమైనా ఎక్స్‌ప్లనేషను చెప్పుకోవలసి ఉంటుంది గాని ఇక ఏమీ ఉండదు. వారికి నామ మాత్రంగా కాల వ్యవధి ఇవ్వడం న్యాయం. కాగా మా పార్టీలో ఉన్న వారు చాల పెద్ద పెద్ద వారిని ఓడించి వచ్చారు. అటువంటి క్రొత్త వారికి ఉత్సాహం ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇంత వరకు ప్రజల సమస్యలు చర్చించడానికి కాలాన్ని సరిగా సద్వినియోగం చేయలేదు. తమకు తెలుసు ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే దాదాపు రూ. 25 నుంచి రూ. 50 దాకా ఖర్చు ఉంటుందని యీనాడు ప్రజలకు తెలిసినటువంటి విషయమే. ఆ విషయంలో కాలాన్ని సద్వినియోగం చేస్తూ ప్రజల ధనం దుర్వినియోగం కాకుండా చూడవలసిన బాధ్యత తమపై ఉంది. కొన్ని కొన్ని విషయాలలో తమరు నిర్దిష్టమైన నిర్ణయాలు చేయవలసి ఉంటుంది. అటువంటి నిర్ణయాలు తీసుకొనే ధైర్యాన్ని తమకు భగవంతుడు సమర్పించాలని కోరుతూ మా పార్టీ తరపున ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను. 11-30 a.m.

శ్రీ ఎ. వెంకట సూర్యనారాయణ (రాజోలు):—అధ్యక్షా, తమరు యీ సభకు అధ్యక్ష పదవికి యేకగ్రీవంగా యెన్నికయినందుకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. ఈ సభలో పోయిన పక్షం నుంచి చాలా చర్చలు జరిగినాయి. కాని యీ నాడు తెలుగుదేశం పార్టీ తరపునుంచి యెంతోమంది విద్యావంతులు యెన్నికయినారు. ప్రజలకు యెన్నోవాగ్దానాలు యిచ్చి సభ్యులుగా వచ్చినారు. ప్రశ్నలు వేసే హక్కు ఒక ప్రతిపక్షం సొమ్ము అనుకోకుండా తెలుగుదేశం పార్టీ యీ నాడు నిర్భయంగా క్రియా సమస్యలు కాని, జరుగుతున్న అవినీతి, అక్రమాలు సభాముఖంగా చర్చించి న్యాయం కలుగజేయడానికి కంకణబద్ధులైన సభ్యులు ఉన్నారు. అందువల్ల యీ యువకులను తీర్చిదిద్ది, వీరికి సమానమైన అవకాశం యిచ్చి పార్లమెంటేరియన్‌గా తయారు చేయవలసిన బాధ్యత తమపై ఉంది. మీ పూర్వులు మంచి సాంప్రదాయాన్ని నెలకొల్పినారు. తమరు కూడా మంచి సాంప్రదాయాన్ని నెలకొల్పి తెలుగుదేశం పార్టీకి మంచి పేరును సంపాదింస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. ప్రకాశరావు(పెద్దపల్లి):—అధ్యక్ష, తమరు యీ 7వ సభకు అధ్యక్షునిగా యేకగ్రీవంగా యెన్నికయినందుకు నేను మా పార్టీ సంజయ విచార్ మంచ్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ సభలో పాలక పక్షాన్ని ప్రతిపక్షాన్ని సమ దృష్టితో చూడాలని మా పార్టీ తరపున సంపూర్ణ సహకారం యిస్తామని తెలియజేస్తూ చివరగా మరొకసారి అభినందనలు తెలియజేస్తు నా ఉపన్యాసం ముగిస్తున్నాను.

శ్రీ ఎస్. విజయరామరాజు:— పాయింట్ ఆఫ్ ఆర్డర్ సార్. ఇప్పుడు కొంతమంది సభ్యులు బేడ్జెస్ పెట్టుకొని హౌవుస్‌లోకి వచ్చి కూర్చున్నారు.

మిస్టర్ స్పీకర్:— తప్పు లేదు.

శ్రీ ఎం. ఓంకార్:— సభలో బేడ్జెస్ పెట్టుకోకూడదు. అనేకమంది పెట్టుకొని వారు ఉన్నారు.

మిస్టర్ స్పీకర్:—సభ్యులు కొత్త వారు కనుక ఆ విధంగా వారు పెట్టుకొని వచ్చినారు.

శ్రీ ఎం. వెంకయ్యనాయుడు:— పాయింట్ ఆఫ్ సబ్‌మిషన్ సార్. ఇప్పుడు ఇక్కడసభ్యులు బేడ్జెస్ పెట్టుకోవచ్చు. పెట్టుకోకూడదా అనేది తమరు నిర్ణయించి దానిపైన రూలింగ్ యివ్వండి. వారు క్రొత్త వారు కనుక వారు ఆ విధంగా పెట్టుకొని వచ్చినారు. కాని తమరు నాయకులతో మాట్లాడి ఒక నిర్ణయం తీసుకోవచ్చును. దానిని తమరు రూలింగ్ చేయవద్దు.

మిస్టర్ స్పీకర్:— రూలింగ్ ఏమిలేదు.

శ్రీ ఎం. వెంకయ్యనాయుడు:— తమరు యించాక నథింగ్ రాంగ్ అన్నారు. అది రికార్డులోకి పోతుంది. ఆ విధంగా అయితే దానిని ఆధారంగా

తీసుకొని మరొకరు యింకొకటి బేడ్జి పెట్టుకొని రావచ్చును. కనుక ఆ విధంగా రూలింగ్ చేయవద్దు. తర్వాత నిర్ణయం తీసుకోండి.

మిస్టర్ స్పీకర్:— అట్లాగే.

Sri P. Ashok Gajapathi Raju (Vijayanagaram);—I would like to bring to your notice that Sri Venkaiah Naidu himself, the hon. Member, during the last Presidential election wear a badge and the Speaker has given a ruling that any member can wear a badge.

శ్రీ ఎస్. విజయరామరాజు:— బేడ్జిలు పెట్టుకొనే సాంప్రదాయం ఒకసారి కాదని అన్నారు. అది ఒక రూలింగ్‌గా లేకపోతే యేదైనా ఒక పద్ధతిలో మన సాంప్రదాయాలకు భిన్నంగా ఉండకూడదనే విషయాన్ని చెప్పవలసిన అవసరం కూడా ఉంది.

శ్రీమతి కె. ప్రభావతమ్మ (రాజంపేట):— అధ్యక్షా, తమరు యీ పదవికి యేకగ్రీవంగా యెన్నికయినందుకు అభినందనలు తెలియజేస్తూ మరొక విషయం చెప్పదలచుకున్నాను. ఈ మైక్ పని చేయనందున యీ స్త్రీలకు కూడా అన్యాయం జరుగుతుందనే భయం కలుగుతోంది. స్త్రీల ఓట్లతో యెక్కువ మంది యెన్నికయినారు. కనుక స్త్రీల సమస్య ప్రాధాన్యతను చూసి మాకు యెక్కువ సమయం యిచ్చి స్త్రీల సమస్యలు పరిష్కరించేదానికి తమరు సహాయపడాలని కోరుతూ మా స్త్రీల తరఫున మరొక సారి అభినందనలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి. సీతారాం (ఆముదాలవలస):— అధ్యక్షా, తమరు యీ పదవికి యేకగ్రీవంగా యెన్నికయినందుకు హృదయ పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తమరు శ్రీకాకుళం జిల్లా నుండి శాసనసభ్యులుగా ఎన్నికై యీనాడు శాసన సభకు స్పీకర్‌గా యేకగ్రీవంగా యెన్నికయినందుకు మేము చాలా సంతోషిస్తున్నాము. శ్రీకాకుళం జిల్లా నుండి ఎన్నికైన రోఖం దొరగారు గతంలో స్పీకర్‌గా పని చేసి అమూల్యమైన సభా సాంప్రదాయాన్ని మన్నిస్తూ వచ్చినారని సోదర సభ్యులు యిక్కడ అనుభవం ఉన్న శాసన సభ్యులు చెబుతూ ఉండడంవల్ల తెలియ వచ్చింది. మరి తమరు కూడా అంతకంటే ఘనంగా శాసన సభా సాంప్రదాయాన్ని పాటిస్తూ యీ సభకు, శ్రీకాకుళం జిల్లాకు, యీ రాష్ట్రానికి మంచి పేరు తెస్తారని ఆశిస్తున్నాను. అన్నిటికన్నా ముఖ్యంగా ఈ ఏడవ శాసన సభకు చాలా మంది యువ నాయకులు శాసనసభ్యులుగా ఎన్నికయి వచ్చారు. ప్రజల సమస్యలను తీరుస్తారని ఆశిస్తూ ప్రజలు తెలుగు దేశము పార్టీకి చెందిన ఎక్కువ మంది యువనాయకులను ఎన్నుకొన్నారు. వారి సమస్యలను మీ ముందు వుంచుతాము. వారి వారి నియోజక వర్గంలోని సమస్యలను మెజారిటీ వున్న-అందులో యువనాయకులు సభ దృష్టికి తేవడానికి వారికి ఎక్కువ సమయము కేటాయించాలని కోరుతున్నాను. ప్రభుత్వ పక్షము కదా యని తక్కువ టైం కేటాయించాలని, ప్రతిపక్షము కదాయని

ఎక్కువ టైం కేటాయించాలని నిర్ణయం చేయకూడదని మనవి చేస్తున్నాను. అలాగ చేసినట్లయితే మాపై ప్రజలకు విశ్వాసము తగ్గుతుంది. మాకు ఎక్కువ కాలాన్ని కేటాయిస్తారని ఆశిస్తున్నాను. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చొన్న ఇందిరా కాంగ్రెసు సభ్యులు పాలక పక్ష సభ్యులమైన మేమేదో వారిపై కక్ష సాధిస్తామని అంటున్నారు. వాళ్లు ఇంకనూ పాత రంగుటద్దాలలోనుంచే చూస్తున్నట్లు కనబడుతున్నది. వాటిని తీసి వేసి చూస్తే క్లీన్‌గా వాస్తవము కనబడుతుంది.

శ్రీ కె. బాపిరాజు:—మాకు ఏ అభ్యాలు లేవు. సభాధ్యక్షుని ఎన్నిక సందర్భములో వారి అభినందన తీర్మానంపై మాట్లాడకుండా వారేదో మాట్లాడుతున్నారు.

శ్రీ టి. సీతారామ్:—వారన్నట్లుగా నేను ఇతరత్రా ఏమీ మాట్లాడలేదు. అభినందన తీర్మానము పైననే మాట్లాడుతున్నాను. ఎన్నడునూ, సభావాక్కులను కాలరాసే పరిస్థితి వుండదు. ఈ నాటి సభలో వున్న యువతరానికి ఎక్కువ సమయాన్ని కేటాయించి, వారిపై ఏమైనా తప్పులుంటే ఈ సభలో.....

(ఇంటరప్షన్స్)

అధికార పక్షములో వున్న యువతరము తప్పు చేస్తే, అమూల్య అనుభవముగల సీనియర్ సభ్యులు అట్లా కాదు. ఇలా చేయండని సలహాలిచ్చి మార్గదర్శకులుగా వుంటారని, అలాగే, వారి సలహాలతో సభను రాణింప జేస్తారని ఆశిస్తూ, ఏకగ్రీవంగా ఎన్నికయిన తమరికి, యువకుల తరఫున, మా తెలుగుదేశం పార్టీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:—అధ్యక్షా, తమరు ఈ సభావాక్కులకు రక్షకుడిగా వుంటూ, ఈ సభను హుందాతనంగా, స్వతంత్రంగా నడుపుటకుగాను ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. నేను ప్రధానంగా కోరుతున్నది ఒక్కటే. గత శాసన సభను ప్రక్కకు పెట్టండి. సభలో కారణము చెప్పేటప్పుడు "తండ్రిని చంపి, తండ్రి లేడని కోర్టు ముందు చెప్పినట్లుగా" అటువంటి సాంప్రదాయాన్ని సభలో ప్రవేశ పెట్టడం మాత్రం జరగకుండా తమరు శాసన సభయొక్క స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడాలని ఆ విధంగా చేస్తారని ఆశిస్తున్నాను. శాసన సభయొక్క గౌరవానికి భంగకరము కలుగకుండా, ప్రజలు ఎన్నుకొన్నందుకు ఆర్డినెన్స్‌ల పరిపాలన కాకుండా చూడాలి. ప్రతిపక్షాల బిల్లు శాసన సభముందు వస్తే, అది ప్రజారంజకంగా వున్నట్లయితే, దానిని పాలక పక్షము వారు గుర్తించాలని కోరుతున్నాను. అదే విధంగా మిత్రులు చెప్పినట్లు కాకుండా, సాంకేతిక కారణాలు చూపకుండా, ఎక్కువ రోజులు మీటింగులు పెట్టి ప్రజల సమస్యలను సభలో ప్రతిబింబింపచేయడం చాలా అవసరము. చాలా మంది మిత్రులు మాట్లాడుతూ, పాలక పక్షము వారు మూడింట రెండు వంతులున్నారు కాబట్టి, తప్పనిసరిగా రెండు వంతులు సమయం వారికి కేటాయించాలనే

పాదన చేస్తున్నారు. ఈ సందర్భములో ఒక మాట చెబుతున్నాను. పాలక పక్షానికి పరిపాలించే హక్కు మాత్రమే దొరికింది. పాలక పక్షము యొక్క పరిపాలనలోని లోపాలను ఎక్కడయినా వుంటే ఈ సభ ద్వారా ఎత్తిచూపే హక్కు, అవకాశము ప్రతిపక్షాలకు వుంటుంది. తన తప్పులు తాను తెలుసుకొనే అవకాశము పాలక పక్షానికి తక్కువగా వుంటుంది. వాటిని ఎక్కువగా తెలుసుకొని వివరంగా సభ దృష్టికి తీసుకొని రావడం ప్రతిపక్షాలకు ఎక్కువ బాధ్యత వుంది కాబట్టి, అందుకుగాను ప్రతి పక్ష సభ్యులకు ఎక్కువ టైం కేటాయించి, తమ హుందాతనాన్ని ప్రజలకు చూపించే బాధ్యత పాలన పక్షానికి వుంటుంది. మీ సామర్థ్యాన్ని ప్రజలకు చూపండి. ప్రతిపక్షాలకు తమరు తప్పని సరిగా రక్షకులుగా వుండేటట్లు వ్యవహరించాలని మనవి చేస్తున్నాను, శాసన సభ యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని, శాసన సభ యొక్క గౌరవాన్ని ఇనుమడింపజేసే విధంగా తమరు వ్యవహరిస్తారని ఆశిస్తూ. తమరు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

శ్రీమతి గ్రంధి మాధవి (విశాఖపట్టణం):—సభాధ్యక్షులుగా ఈనాడు తమరు ఏకగ్రీవంగా ఎన్నిక అయినందుకు నా అభినందనలు తెలియజేస్తున్నాను. తమరు శ్రీకాకుళం జిల్లాలో బార్ ఎసోసియేషన్ అధ్యక్షులుగా ఉండి తెలుగు దేశం పార్టీ తరపు నుంచి యీ శాసన సభకు ఎన్నికయి, యీ శాసనసభకు సభాపతిగా ఎన్నిక అయినందుకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది వరకులాగే శాసనసభలో తమరు స్పీకరుగా ఉన్న కాలంలో సత్ సాంప్రదాయాలను నెలకొల్పగలరని ఆశిస్తున్నాను. సాధారణంగా ఎక్కువమంది ప్రజలలో స్త్రీలు కాబట్టి ఆ స్త్రీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా శాసనసభ్యులుగా ఉన్న మాకు శాసన సభ చర్చలలో పాల్గొనడానికి అవకాశం ఎక్కువ యివ్వాలని కోరుతూ మరల తమకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేసుకుంటూ శలవుతీసు కుంటున్నాను.

శ్రీ ఎం. సంజీవ రెడ్డి (నంద్యాల):—అధ్యక్షా, ఈ ఏడవ శాసనసభకు తమరు ఏకగ్రీవంగా సభాధ్యక్షునిగా ఎన్నిక అయినందుకు నా అభినందనలు తెలియజేస్తు న్నాను. ఒక న్యాయవాదిగా ఉన్న తమరిని ఏకగ్రీవంగా ఈఅధ్యక్షస్థానానికి ఎన్నిక చేసుకోవడం, శ్రీకాకుళం జిల్లాలో బార్ సోసియేషన్ అధ్యక్షులుగాఉన్న తమరు యీ శాసన సభా పతిగా కూడా తమ బాధ్యతలు సక్రమంగా నెరవేర్చ గల రని ఆశిస్తున్నాను. అంతే కాకుండా ప్రతి పక్షాలలో ఉన్న వారు ప్రజల విశ్వాసం కోల్పోవడమే కాకుండా యిక్కడ ఉన్న మైకుల విశ్వాసం కూడా కోల్పోయినందు వల్లనే వారి వైపు మైకులు పనిచేయడం లేదు. ప్రజల కోర్కెలను తెలియజేయడానికి యీనాడు ప్రతిపక్షంలో కూర్చున్నవారు ఎక్కువ టైము కేటాయించాలని చెబుతున్నారు. అది హాస్యాస్పదగా ఉంటుంది. ఎందు కంటే మా తెలుగుదేశం పార్టీ తరపున మేముకూడా ఈ శాసనసభలో మూడింట రెండు వంతులు సభ్యులుగా ఉంటున్నాము. అందు వల్ల తెలుగుదేశం పార్టీ మెంబర్లు కూడ ప్రజల సమస్యలు పరిష్కారానికి తెలియజేయడానికి ఎక్కువ టైము

కేటాయించాలి. యిప్పుడు తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయిన యువకులు, ఉత్సాహవంతులైన సభ్యులు ఉన్నారు కాబట్టి వారికి కూడ యీ శాసన సభా కార్యక్రమాలలో మాట్లాడడానికి ఎక్కువ అవకాశం యివ్వాలి. తరువాత తమరిని సభాపతిగా ఎన్నుకున్న తరువాత తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయాలని కొంత మంది ప్రతిపక్ష సభ్యులు కోరారు. కాని తెలుగుదేశం పార్టీకి తమరు రాజీనామా చేయవలసిన అవసరం లేదనిచెబుతున్నాను న్యాయవాదిగా ఉన్న తమరు సభాపతిగా ఎన్నిక అయినందుకు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆర్. రాజగోపాల్ రెడ్డి(అక్కిరెడ్డిపల్లి) :—అధ్యక్షా ఈ 7వ శాసనసభ జరుగుతున్న సందర్భంలో యీ శాసనసభకు సభాపతిగా ఎన్నిక అయినందుకు నా హృదయపూర్వక అభివందనలు తెలియజేస్తున్నాను. మనము 1967 సంవత్సరంలో యిదే శాసనసభలో సభ్యులుగా ఉన్నపుడు మనము అందరము కలిసి పనిచేసాము. తమరు అప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ చాలా చురుకుగా సభా కార్యక్రమాలలో పాల్గొంటూ వచ్చారు. అటువంటి మిత్రులు యీనాడు యీ నూతన వాతావరణంలో యీ శాసనసభకు సభాపతిగా ఎన్నుకోబడినందుకు చాలా సంతోషిస్తున్నాను. ఇంతవరకూ యీ శాసనసభకు ఎన్నుకోబడిన అధ్యక్షులకంటే కూడా తమరు వారి వయస్సుకంటే చిన్నవయస్సు కలవారు. అందువల్ల యీ శాసనసభకు సభాపతిగా నూతన ఉత్సాహాన్ని కలుగజేస్తారనే నమ్మకం నాకు ఉంది. ఇక్కడ శాసనసభలో అనేక సత్ సాంప్రదాయాలు ఉన్నాయి. ఆ సాంప్రదాయలను నిలబెట్టుకుంటూ ఇప్పుడు యీ నూతన శాసనసభ చరిత్రలో కూడా సత్ సాంప్రదాయాలు సృష్టించుకుంటూ యీ సభను హుందాతనంగా నడపగలరని భావిస్తున్నాను. ఇక్కడ మన పార్టీ తరపున నూతనంగా ఒక మహోత్తరమైన సాంప్రదాయాన్ని కూడా నెలకొల్పగలరని ఆశిస్తున్నాను. మామూలుగా ప్రజాసమస్యలు వచ్చినపుడు వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవలసినపుడు బాధ్యతలు దాటవేసే సంఘటనలు చాలా ఉన్నాయి. ప్రజాసమస్యలను శాసనసభలు పరిష్కరించలేక పోతున్నాయనే బాధ ప్రజలకు ఉంది. అనేకమైన అవినీతి ఆరోపణలు యీ శాసనసభలో చర్చకు వచ్చినపుడు ప్రశ్నోత్తరాల సమయంలో కాని వేరే చర్చలలో కాని ఆ సమస్యలను దాటవేయడం మంచి సాంప్రదాయం కాదు. కాబట్టి రాబోయే మన శాసనసభ చర్చలలో ఏ సంధర్భంలో అయినా ప్రజా సమస్యలు వచ్చినపుడు అవి అవినీతికి సంబందించినవి. అయితే వాటిని తుణ్ణంగా వెంటనే పరిశీలన చేసి పరిష్కరించాలి. అటువంటపుడే అది మహత్తరమైన సాంప్రదాయం అవుతుంది. సుబ్బారెడ్డిగారు స్పీకరుగా ఎన్నికైన సందర్భంలో కూడా నేను యీ విషయాలు చెప్పాను. తమరు యువకులుగా ఉన్నారు కాబట్టి యీ నూతన వాతావరణంలో యీ మహత్తరమైన ప్రభుత్వ యంత్రంగాన్ని నడుపుతున్నపుడు ఏ సమస్య వచ్చినా యిక్కడ శాసనసభలోనే పరిష్కారం అయ్యే అవకాశం కలుగజేయాలి అది మీరు ముందు జేయబోయే మహోత్తరమైన ఆశయంగా పెట్టుకొని దానిని

నెరవేర్చాలని కోరుతున్నాను. ఇంకో విషయం ఏమిటంటే యిపుడు ప్రభుత్వ పక్షము, ప్రతిపక్షము అనే తేడాలు చెబుతూ సభ్యులు మాట్లాడుతున్నారు. ప్రతి సమస్యకు ప్రభుత్వమే బాధ్యతగా ఉండాలని అంటున్నారు. ఈ సభలో ఉన్నపుడు ఏదైనా సమస్య చర్చకు వచ్చినపుడు అది ప్రతి పక్షము, ప్రభుత్వ పక్షము అనే తేడా చూడకుండా ప్రతీ సభ్యుడు కూడా బాధ్యతగా సంపూర్ణ హృదయంతో వ్యవహరించాలి. మనం అందరమూ కూడా ప్రతి సమస్యను కలిసికట్టుగా చర్చించి ఆ సమస్యను పరిష్కరించాలి. అందులో ప్రతిపక్ష, ప్రభుత్వ పక్ష తేడాలు పెట్టుకోకూడదు. ఒకరు మాట్లాడుతున్నపుడు మరొకరు పాయింటు ఆఫ్ ఆర్డర్సు లేవదీయడం ఒక సభ్యునిపై మరొక సభ్యుడు ఆరోపణలు చేసుకోవడం కూడా మంచిది కాదు. ప్రతీ విషయంలోనూ ఒకరికొకరు అవగాహన చేసుకొని నడవాలి. ఇపుడు ఎన్నికలలో వారిపై వీరు గెలిచారు, వీరిపై వారు గెలిచారు అనేది ఉండకూడదు. ఆ ఎన్నికలు అయిపోయినాయి. ఇక్కడ జైపాల్ రెడ్డిగారుగాని, వెంకయ్యనాయుడుగారుగాని సహేతుకమైన సలహాలు యిచ్చినపుడు ఒక మంచి ప్రజా సమస్య చర్చకు వచ్చినపుడు ఒకరితో ఒకరు సంప్రదించుకొని దానిని పరిష్కరించుకోవాలి. అందులో ఆ పక్షమువారు, యీ పక్షమువారు అనే తేడా ఉండకూడదు. మనము అందరము కూడా ప్రజలచే ఎన్నుకోబడిన మనుషులము. అందువల్ల చిత్తశుద్ధితో ప్రజా సమస్యలను పరిష్కరించుకోవాలి. ఆ సమస్యల పరిష్కారంలో సభాపతిగా బాధ్యతలు నిర్వహించడానికి మన సభ్యులందరమూ కూడా సహకరించాలి. ఈ సభను హుందాతనంగా నడపగలరని, సభాపతిగా తమ బాధ్యతలను నెరవేర్చగలరని ఆశిస్తూ యిక్కడ శాసనసభలో మహోత్తరమైన సాంప్రదాయాలను నెలకొల్పగలరని భావిస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. హనుమంతరావు (నూజివీడు):—అధ్యక్షా, ఈ ఏడవ శాసన సభకు సభాపతిగా మీరు ఏకగ్రీవంగా ఎన్నిక అవడము చాలా సంతోషదాయకము. 12-00 noon పోతే ఇప్పుడు పాలక పక్షము, ప్రతిపక్షము అనే వాదోపవాదాలకు అస్కారము లేకుండా ప్రజా సమస్యలలో కానీ, ఏదైనా సందర్భంగా మాట్లాడవలసి వచ్చినపుడు అందరికి సరైన అవకాశము కల్పిస్తారని, ఏవిధమైన అపోహాలకు దారి తీయకుండా మీ అధ్యక్ష స్థానానికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నాను. మీరు అడ్వకేటు. నేను కూడా అడ్వకేటుగా మీకు ప్రత్యేక శుభాకాంక్షలు అందచేస్తూ ఈ శాసన సభ యొక్క గౌరవాన్ని సభ్యుల గౌరవాన్ని కాపాడి, మన ఆంధ్ర ప్రదేశ్ చరిత్రను ముందుకు తీసుకురాగలరని ఆశిస్తూ మీకు నా హృదయ పూర్వక అభివందనలు అందచేస్తున్నాను. ముఖ్యంగా నేను స్వతంత్ర్య అభ్యర్థిని. మా సభ్యులు 10 మందిమి ఉన్నాము. అందరికీ కూడా మీరు సముచితమైన స్థానాన్ని ఇస్తారని, మా అభిప్రాయాలు తెలపడానికి తమరు అవకాశము ఇస్తారని, మేము సంఖ్యాబలంలో తక్కువైనా, మా న్యాయమైన రిప్రజెంటేషన్లను పరిశీలించి, మాకు కూడా అవకాశము ఇస్తారనే నమ్మకముతోటి మిమ్ములను మరొకసారి అడ్వకేటుగా అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి. హెచ్. రామకృష్ణా రెడ్డి (పాణ్యం):—అధ్యక్షా, ఈ 7వ శాసన సభకు మీరు ఏకగ్రీవంగా శాసన సభాపతిగా ఎన్నిక అయినందుకు నేను తెలుగు దేశం తరపున నిండు హృదయంతో కృతజ్ఞతాభివందనలు తెలియచేస్తున్నాను. ముఖ్యంగా గౌరవ ప్రతిపక్ష నాయకులు మమ్ములను చాలా చిన్న వాళ్లమని, రాజకీయ అనుభవం లేదని కఠిన పదజాలంతో బెదిరించి, భయాలు కల్పించి ప్రవర్తిస్తున్నారు. మాకు రాజకీయ అనుభవము లేక పోయినా అందుకు తగిన పరిజ్ఞానము ఉంది.

శ్రీ ఎస్. విజయరామరాజు:—పాయింట్ ఆఫ్ ఆర్డర్ సార్. ప్రతిపక్ష నాయకులు ఎవరూ కూడా వారికి అనుభవం లేదన్నట్లు ప్రవర్తించటను నాకు తెలీదు. వారికి అటువంటి అపార్థము కలిగితే అందుకు విచారము తెలియ చేస్తున్నాను.

శ్రీ సి. హెచ్. రామకృష్ణా రెడ్డి:—అధ్యక్షా, ఆ విధంగా మా యువతరానికి రాజకీయ అనుభవము, పరిజ్ఞానము లేదు అనిపించుకోకుండా సభామర్యాదను కాపాడడానికి మా తారక రామునికి అండగా నిలచి మా శక్తిని మా పార్టీ ప్రమాణాలకు అనుగుణంగా మన రాష్ట్ర సౌభాగ్యానికి దోహదం చేస్తాము. తెలుగుదేశం పార్టీ యువకులము కోతి పిల్లలు కాకుండా ముందు కాలంలో వీరాంజనేయులుగా శాసన సభలో గానీ, బైట గానీ నిర్దేశించిన ప్రకారంగా కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా అమలు చేయడానికి పూను కుంటామని సభాముఖంగా తెలుపుతూ మా పార్టీ తరపున మరొకసారి తమరు ఏకగ్రీవంగా ఎన్నిక అయినందుకు హృదయ పూర్వక అభినందనలు అందచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. అప్పల నరసింహం (పెందుర్తి):—అధ్యక్షా, తమరు 7వ శాసన సభకు సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయినందుకు అభినందనలు తెలియ జేస్తున్నాను. తమరు లోగడ సమితి అధ్యక్షులుగా, శాసన సభ్యులుగా ఎంతో అనుభవము ఉన్నవారు. పెద్దలు. చాలా నిర్మొహమాటమైన వ్యక్తులు. మీరు స్వతంత్ర పార్టీ నుంచి రాజీనామా చేసినపుడు చాలా నిర్మొహమాటంగా చేసిన విషయం మాకు తెలుసు. ఏమైనా తమరు నిష్పాక్షికంగా ఈ పదవిని నిర్వహించ గలరని, ఈ సభను నడిపించగలరని మా నమ్మకము. మా తెలుగు దేశం పార్టీ మా నాయకుని అడుగు జాడలలో, క్రమశిక్షణతో ఉండగలదు. ఏమైనా ప్రతి పక్ష సభ్యులు, గౌరవ సభ్యులు తమను చాలా హుందాగా ఆహ్వానించినందులకు వారిని నేను అభివందిస్తున్నాను. చిన్న మంత్రివర్గాన్ని వేసి పరిపాలనా యంత్రాంగాన్ని చేపట్టిన మా నాయకులు అభినందనీయులు. ఏదైనా సమస్య పరిష్కారమునకు శాసన సభ్యులు దోహదం చేయాలని నేను కోరుతున్నాను చట్టాలు, నిబంధనలు చేసే ముందు, సభా మర్యాదను కాపాడటానికి, నిర్భయంగా ప్రజా సమస్యలు పరిష్కరించడానికి, ప్రతిపక్షములో ఉన్నప్పటికి, ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని ఆశిస్తున్నాను. ఈ సభ సంప్రదాయాన్ని, మర్యాదని

కేటాయించిన విధులకు, టైముకు కట్టుబడి ఉంటామనీ, తమరు కూడా ఈ సభను సుజావుగా నిర్వహించగలరని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి. హెచ్. జంగారెడ్డి (శ్యాంపేట):—అధ్యక్షా, మీరు 7వ శాసన సభకు సభాపతిగా ఎన్నిక అయిన సందర్భంలో మిమ్ములను అభినందిస్తున్నాను. మీరు ప్రతిపక్షంలో ఉన్నవారు కాబట్టి ప్రతిపక్షము యొక్క అవసరమేమిటో వారికి ఎంత టైము కేటాయించాలో బాగా తెలుసు. అయితే ఒక క్లిష్టమైన పరిస్థితిలో సభాపతిగా ఎన్నికైనారు. ఇందిరా, తారకరాముల భజనపరుల మధ్యలో మేము తక్కువ సంఖ్యలో ఉన్నాము. వారితో సమానంగా ఈ నేషనల్ పార్టీలకు కూడా తగిన సమయము ఇవ్వాలి. పాలక పక్షం వారు ఎక్కువ టైము కోరుతున్నారు. క్రొత్త ప్రభుత్వం, మంత్రులు చేసే తప్పుడు పనులు గాని తప్పుడు విధానాలు కాని, ప్రజల సమస్యలు గాని, వారి పార్టీ సమావేశాలలో చర్చించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయి. కాబట్టి అసెంబ్లీలో అవసరం లేదు. ఒక వేళ వారి తప్పుడు పనులు అసెంబ్లీలో తీసుకు వస్తే డిసిప్లినరియాక్షన్ తీసుకోవటానికి అవకాశము ఉంటుంది: కాబట్టి నేను మనవి చేసేదేమంటే 50 శాతము ప్రతిపక్షానికి, 50 శాతము పాలక పక్షానికి కేటాయించాలి. ఆ సంప్రదాయాన్ని మీరు తిరిగి అమలు చేస్తారని ఆశిస్తూ మీకు మరోసారి అభినందనలు తెలుపుతున్నాను.

శ్రీ కె. వెంకటేశ్వరరావు (కొల్లాపూర్):—అధ్యక్షా, ఈ రాష్ట్ర ఏడవ శాసన సభకు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా మీరు ఎన్నిక కావడము, సభాసంప్రదాయములు పాటించటములో మనము కార్యకర్తలము అవుతున్నామన్న సంగతి వెల్లడి అవుతున్నది. మీరు పాలక పక్షము వారైనా, ఈ నాడు పార్టీలన్నిటికి అతీతంగా ఉండే ధర్మాసనంలో ఉన్నారు. మీ విధులను నిర్వహించడంలో మీకు ఉన్న అనుభవాన్ని ఎంతైనా వినియోగించుకొని, న్యాయ శాస్త్ర పరిధిలో మీకున్న అనుభవాన్ని జోడించి సభా కార్యక్రమాన్ని నిర్వహించడంలో దక్షత ప్రదర్శించడమే కాకుండా అన్ని పక్షాల వారి ఆశలను అడియాసలు చేయకుండా సమస్యలను నిష్పక్షపాతదృష్టితో చూస్తూ వ్యవహరించగలరనే ఆశాభావము మాకు ఉంది. సమితి అధ్యక్షులుగా కూడా మీరు బాధ్యత నిర్వహించారని, శాసనసభ్యులుగా ఒక కాలం సభ్యులుగా కూడా ప్రతిపక్షంలో వుండి, చాలా అనుభవం గడించారని తెలుస్తున్నది. ఈనాడు విపరీతమైన మెజారిటీ సంపాదించుకున్న తెలుగుదేశం పార్టీ స్నేహితులకు, తోటి శాసనసభ్యులకు ఆకాంక్షలు, లక్ష్యాలు విపరీతంగా వున్నాయి. పాపం, వారి చేతిలో పదవి వుండి కూడా, మీరు న్యాయం చేస్తారో, లేదో అనే అనుమానాలు వెల్లడిస్తున్నట్లుగా వుంది. లేకపోతే, ఈరోజున యీ సభలో మీకు అభినందనలు తెలిపే సమయంలో టైము కేటాయింపు గురించి మిమ్మల్ని పదే పదే ప్రార్థించడంలో, అభ్యర్థించడంలో అర్థం వున్నట్లు నాకు కనబడడం లేదు. వాస్తవం చూస్తే—చరిత్ర ఒక తీర్పు యిచ్చింది. ప్రజాస్వామ్యంలో అధికారం చేతులు మారడం సర్వ

సామాన్యం. ఉత్కృష్టమైన సాంప్రదాయం కూడా. ఒకనాటి పాలక పక్షం వారు యీనాడు ప్రతిపక్షంలో వున్నారు. ప్రతిపక్షంలో ఉంటే—వారిని కించపరచవలసిన అవసరం లేదు, మిత్రులు జైపాల్ రెడ్డిగారు మాట్లాడుతూ తాము కన్న కలలు యీరోజున నిజమైనవని సంతోషం వ్యక్తం చేశారు, చాలా అనుభవం గడించిన పార్లమెంటేరియన్ ఆయన, వక్తృత్వ సామర్థ్యం వుంది, భావ పటిమ వుంది, కాని ఆయన ఇంత హుందాతనం లోపించిన పద్ధతిలో మాట్లాడతారని నేను అనుకోలేదు, ఒక విషయం వారు అర్థం చేసుకోవాలి, ఈనాడు అధికారం చేతులు మారినా, మేము బలీయ ప్రతిపక్షంగా రూపొందినవారం, వారు కన్న కలలు నిజమై వుండవచ్చు, కాని ఇంకొక కల మాత్రం కల్ల అయిందని మాత్రం అంటున్నాను, వారు ఏకాకిగా వుండిపోయే దౌర్భాగ్య పరిస్థితి కలిగింది.

Sri M. Venkaiah Naidu:—We are all beside him. Don't worry.

శ్రీ కె. వెంకటేశ్వరరావు:—ప్రతిపక్షంలో మాతోబాటుగా సహచరులుగా వారు వ్యవహరిస్తున్నారు, యుక్తి, శక్తి, యువకరక్తం వారిలో ప్రవహిస్తున్నవి. జైపాల్ రెడ్డిగారుగాని, వెంకయ్యనాయుడు గారుగాని వారు అధికారపక్షం పట్ల సానుభూతి ప్రదర్శిస్తే ప్రదర్శించవచ్చుగాని, కాని వారు నిర్వహించవలసిన పాత్ర మాత్రం ప్రతిపక్షం అనే విషయం వారు మరచిపోగూడదు. చేపట్టిన కార్యవిధానానికి ప్రత్యేకమైన, రసవత్తరమైన పరిస్థితిని కల్పించాలంటే, వారు యింతకుముందు వహించిన పాత్రను మాత్రం వారు మరచిపోకూడదని విస్మరించకూడదని నేను మనవిజేస్తున్నాను. ఈరోజున సమస్యలు సృష్టించిన వారం మేము లేక మీరు అని చెప్పడం తప్పు, తెలుగుదేశం పార్టీలో కూడా ఒకనాడు అధికారం, బాధ్యతలు స్వీకరించి నిర్వహించిన పెద్దలు, మిత్రులు ఎందరో వున్నారు. రాజకీయ పరిస్థితులు తారుమారైనవి. ఒక అవకాశం వచ్చింది, మీరు యీనాడు ఆంధ్రరాష్ట్రంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభించడానికి కారకులైనారు, మేము సంతోషిస్తున్నాం. ప్రజలు తీర్పు యిచ్చారు, శిరసావహిస్తున్నాం. అంతమాత్రంచేత మీరు అగ్రస్థానంలో వున్నారనే దుర్గర్వంతో వ్యవహరిస్తే, యింకో ప్రవాహం వచ్చి మీరు కొట్టుకుపోతారు. పరస్పర సహనం, సహకారాలతో, సామరస్యంతో యీ సమస్యలు పరిష్కరించుకోవాలి. మేము ప్రతిపక్షంలో వున్నా—రెస్పాన్సిబుల్ ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని నేను మీకు హామీ యిస్తున్నాను. ఈసందర్భంలో మీరు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినందుకు నేను మీకు హృదయపూర్వకమైన అభినందనలు సమర్పిస్తూ ముగిస్తున్నాను.

శ్రీ డి. రవీంద్రనాయిక్ (దేవరకొండ) :—అధ్యక్షా, ఏడవ శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సందర్భంగా నేను తమకు అభినందనలు తెలియజేస్తున్నాను, తమరు న్యాయవాదిగా, యీ సభలో తీసుకోవలసిన కార్యక్రమాన్ని గుర్తించారు, తమర్ని అభినందించే సందర్భంగా ఇంతవరకు మాట్లాడిన సభ్యులు అనేక విషయాలు చెప్పారు, ఇతర సమస్యలతోబాటుగా, సమాజంలో అట్టడుగున

పడివున్న గిరిజన జాతి సమస్యలకు సంబంధించి కూడా తమరు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నేను కోరుతున్నాను. పెద్దలు కొంతమంది మాట్లాడుతూ సభ్యులను యువకులు, వృద్ధులు, చదువుకున్నవారు, చదువురాని వారు అని వర్గీకరణ చేసి మాట్లాడారు. ఆ రకంగా వర్గీకరణ చెయ్యడం సమంజసం కాదని నేను మనవి జేస్తున్నాను, అదే విధంగా, వంద సంవత్సరాల చరిత్రగలిగిన కాంగ్రెసు పార్టీ ఏమీ చెయ్యలేకని కొందరు పెద్దలు మాట్లాడారు, ఇది తమరిని అభినందించే సమయం, కాబట్టి నేను ఇతర విషయాలలోకి యిప్పుడు పోదలచుకోవడం లేదు. వారు గుర్తించవలసిన విషయమేమంటే—ఎన్నికలలో పార్టీలు గెలుస్తుంటాయి, ఓడి పోతుంటాయి. ఐనప్పటికి, కాంగ్రెసు పార్టీ ఇందిరాగాంధీగారి నాయకత్వంలో తీసుకున్న నిర్ణయాలు చాలా వున్నాయి. అది చెప్పడానికి ఇది సమయం కాదేమో, దేశంలో విప్లవాత్మకమైన మార్పును ఇందిరాగాంధీగారు తీసుకువచ్చిన విషయం యీ సందర్భంగా నేను ఉదహరించక తప్పదు. అందులో కొన్ని—బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణలు, వెట్టి చాకిరీ నిర్మూలన, 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం మొదలైనవి, అంతేగాక, హరిజనులకు, గిరిజనులకు గ్రామస్థాయిలో కూడా రిజర్వేషన్సు కల్పించారు. కాంగ్రెసు పార్టీ చాలాచేసినది, చెయ్యవలసిందినది యింకా చాలా వుండవచ్చు; కొంతమంది గేలి చేశారు. మా పార్టీ సమస్యలను సృష్టించిందన్నారు. అలాగే యువకులు, వృద్ధులు, చదువుకున్నవారు, చదువురాని వారు అని సభ్యులను వర్గీకరించి మాట్లాడారు. ఈ విధంగా మాట్లాడడం కాక, వారు ఆచరణలో చూపాలి. ఈ సభా సాంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత తమపై వున్నదని నేను మనవి జేస్తున్నాను. ప్రజల సమస్యలైనా రాష్ట్ర సమస్యలైనా అందరికీ ఒకటే, ఏ శాసన సభ్యునికైనా ఒకటే. జయపాల్ రెడ్డి గారు వెంకయ్య నాయుడు గారు మాత్రం ప్రతిపక్షంలో ఉండి కూడా పాలక పక్షం వైపునే మాట్లాడారు. వారి నుంచి ఎంతో గైడెన్స్ వస్తుందని ప్రతిపక్షంలోనికి వచ్చిన మేము ఎంతో ఆశించాము. మా పార్టీ ఓడిపోయినందుకు నా కోరిక తీరిందని జయపాల్ రెడ్డి గారు అన్నారు. మా పార్టీ ఎంతో చరిత్ర కలిగిన పార్టీ. ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన పార్టీ. ఈ విషయం నేను గుర్తుకు తెస్తున్నాను. గిరిజన ప్రతినిధిగా నేను చెప్పేది ఏమిటంటే—ఎన్నో కార్యక్రమాలు చేసినప్పటికి చేయవలసినవి చాలా ఉన్నాయి. మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 30 కోట్లు ఉండే జనాభా ఈ రోజున 60 కోట్లు అయినది. జనసంఖ్యతో పాటు సమస్యలు పెరుగుతున్నాయి. దీనిని అర్థం చేసుకోవాలని యువ శక్తికి మనవి చేస్తున్నాను. తమరు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సభ విధులను సక్రమంగా నిర్వహిస్తారని మాకు పూర్తి నమ్మకం ఉంది. ఎవరికి ఎంత సమయం ఇవ్వాలనేది తమకు తెలుసు. దేశ భవిష్యత్తుకు జాతి భవిష్యత్తుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయవలసి ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞత తెలుపుతూ నేను చెప్పిన వాటిలో ఏమైనా పొరపాటు ఉంటే మన్నించాలని కోరుతూ తమరిని మరొక సారి అభినందిస్తున్నాను

శ్రీ ఎస్. సంతోష రెడ్డి (ఆర్మూర్) :—అధ్యక్షా, ఏడవ శాసన సభకు తమరు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు హృదయపూర్వకంగా అభినందనలు తెలుపుతున్నాను. మీ గురించి మాకు వ్యక్తిగతంగా పరిచయం లేనప్పటికి, పత్రికలలో చదివిన దానిని బట్టి శ్రీనివాసులు రెడ్డి గారు ఎన్నిక పట్ల మురిసిపోతున్నానని చెప్పిన దానిని బట్టి మీరు ఎంతో సమర్థులనే అవగాహన నాకు కలిగింది. సర్పంచ్ గా సమితి అధ్యక్షులుగా గతంలో శాసన సభ్యులుగా న్యాయ శాస్త్ర కోవిదులు గా మీకున్న అపారమైన అనుభవం దృష్ట్యా సభాపతి స్థానం యొక్క హుందాతనం నిలబెడతారని సమగ్రవంతంగా నిష్పక్షపాతంగా మీ విధులను నిర్వహిస్తారనడంలో ఏమీ సందేహం లేదు. శాసన సభ్యునిగా ఎన్నికైన ప్రతి వ్యక్తి మేధావి అయినా న్యాయ శాస్త్రకోవిదుడైనా ఎంత ఘనుడైనా కాకపోయినా ప్రజా ప్రతినిధే కనుక ప్రజల సమస్యలు ప్రతిబింబించే విధంగా మాట్లాడేటప్పుడు నిష్పక్షపాతంగా అవకాశం కలిగించాలని మనవి చేస్తున్నాను. మాకు విస్మయం కలిగిస్తున్నది ఏమిటంటే—10 సంవత్సరాలుగా జయపాల్ రెడ్డి గారు మమ్మల్ని తిట్టని తిట్టు లేదు, తిట్టిన తిట్టు తిట్టకుండా విమర్శించినప్పటికి, ఇప్పటికి వారికి తృప్తి కలిగినట్లు లేదు. వారికి ఇంకా ఏమి కావాలో తెలియడం లేదు. నిలువు దోపిడీ అయినది. వారు మేము ప్రతిపక్షంగా వ్యవహరించవలసిన అవసరం గుర్తించినట్లు లేదు. పాలక పక్షమైనా ప్రతిపక్షమైనా ఏ ఒక్కరి సొత్తు కాదు. ప్రజలు ఇచ్చే తీర్పు దృష్ట్యా వ్యవహరించుకోవలసి ఉంటుంది. పాలకపక్షంలోని వారు స్వచ్ఛమైన పరిపాలనను అందించవలసి ఉంటుంది. ప్రతిపక్షంలోని వారు ఆరోగ్యకరమైన విమర్శలు చేస్తూ విధి నిర్వహణకు దోహదం చేయవలసి ఉంటుంది. కాంగ్రెసు పార్టీ పాలక పక్షంగా ఉంటూ వచ్చినప్పటికీ ప్రతిపక్షంలో ఉండడానికి భయపడే వారెవరూ లేరు. ప్రజాస్వామ్య సాంప్రదాయాలను పాటించి చక్కటి పరిపాలనను అందించాలని కోరుతూ ప్రతిపక్షాలకు చెందిన వారందరూ కలసికట్టుగా వ్యవహరించి ప్రభుత్వానికి సరైన సలహాలు ఇచ్చి పరిపాలన సక్రమంగా జరిగేటట్లు తోడ్పడవలసి ఉంది. తమరు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మరొకసారి అభినందనలు తెలుపుతున్నాను.

శ్రీమతి ఎం. స్వరాజ్యం (తుంగతుర్తి):— అధ్యక్షా, తమరు ఈ సభకు సభాపతిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలియచేస్తున్నాను. ఈ సభలో ఎవరు ఏ పక్షానికి చెందినవారైనప్పటికి మొట్టమొదట ప్రజల పక్షం అని గుర్తించుకోవాలి. ఒక ప్రక్క ఇందిరా గాంధీ భజన మరొకప్రక్క తారక రాముని భజన చేస్తే ప్రజలు ఏమి చేస్తారో గమనంలో ఉంచుకుని ప్రజాసమస్యలు కోసం మనం ఎన్నికైనాం అనేది గుర్తుంచుకుని తమ ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయాలని విన్నవించుకుంటున్నాను. ఈ సారి కొంత మార్పు వచ్చే పరిస్థితులలో. స్త్రీలకు సరైన ప్రాతినిధ్యం ఈ సభలో దొరుకుతుందని ఆశించినాము. చాలా తక్కువ పాతినిధ్యం స్త్రీల తరపున ఇక్కడ వచ్చింది. గత శాసన సభ అనుభవం బట్టి చూస్తే స్త్రీల సమస్యల విషయం ఎప్పుడు వచ్చినప్పటికి స్త్రీల సమస్యలకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని నా అనుభవం

ద్వారా విన్నవిస్తున్నాను. స్త్రీల సమస్యలు ఎప్పుడు వచ్చినప్పటికి ఏదో రకంగా ప్రక్కకు పెట్టివేయడం జరిగింది. సభలో సరైన చర్చలు జరుగలేదు, విధానాలు నిర్ణయించ లేదు, సమస్యల పరిష్కారానికి ప్రయత్నం జరుగ లేదు, ఆ అనుభవం దృష్ట్యా, స్త్రీల సమస్యలు చర్చకు వచ్చినప్పుడు మాట్లాడే వారు స్త్రీలైనా ఆ సమస్యలలో శ్రద్ధ చూపించే పురుషులైనా వాటికి ప్రాధాన్యత ఇచ్చి దేశం సగం మంది ఓటర్లయిన స్త్రీలకు న్యాయం చేకూర్చాలని కోరుతున్నాను. విధానాల సమస్య, ఆచరణ సమస్యకూడా ఉంది. కొత్త పార్టి అధికారంలోకి వచ్చిన మాట వాస్తవమే. కొత్త విధానాలను నిర్ణయించి కొత్త పద్ధతులలో వాటిని అమలు చేయడం చాలా ముఖ్యం. విధానాల్లో ఇదివరలో కొంత మేలైనవి చేయబడ్డాయి. వాటిని ఆచరణలోనికి తేలేదు. గత ఐదు సంవత్సరాలలో ఇక్కడ సభలో వచ్చిన తీర్మానాలు మొదలైనవే కొన్ని ఆచరణలోనికి రాలేదు. వేస్తామని వాగ్దానం చేసి నప్పటికి అమలు చేయనివి ఉన్నాయి. ఉదాహరణకు భువనగిరిలో షకీలా సందర్భంగా కొన్ని కేసులు పెట్టారు. ఆ కేసులు ఎత్తి వేస్తామని చెప్పారు. కాని ఎత్తి వేయలేదు. ఇక్కడ వచ్చిన వాగ్దానాలు అమలు జరిగేటట్లు చూడవలసిన బాధ్యత తమపై ఉంది.

ఈ సభాకార్యక్రమాలను నడపడము వరకే కాదు మీ బాధ్యత. ఈ సభలో చర్చలు జరిగిన తరువాత తీసుకున్న నిర్ణయాలు సరిగా అమలు జరుగుతున్నాయా లేదా అనేది చూసి కొత్త సంప్రదాయాలను సృష్టిస్తారని ఆశిస్తూ మరొకసారి మా అభినందనలు తెలియచేస్తూ విరమిస్తున్నాను.

శ్రీ పి. వేణుగోపాలరెడ్డి (రాయదుర్గం):— అధ్యక్షా, తమరు ఏకగ్రీవముగా అధ్యక్షులుగా ఎన్నికయినందులకు నా సంతోషాన్ని వెలిబుచ్చుతూ నా శుభాకాంక్షలను తెలియ చేస్తున్నాను. అటు తెలుగుదేశంపార్టీని కాని, ఇటు కాంగ్రెసు పార్టీని కానీ కాదని ఇండిపెండెంట్స్‌గా ఎన్నుకోబడిన మా లాంటివారికి న్యాయము జరగడానికి తమ సహకారము అవసరమని మనవిచేస్తున్నాను. కాంగ్రెసుపార్టీ సభ్యులు, తెలుగుదేశంపార్టి సభ్యులు ఒకరిమీద ఒకరు ఛలోక్తులు విసురుకుంటూ వుంటే మాలాంటి కొత్తవారికి చూడ ముచ్చటగావుంది, కొత్తగా వచ్చిన మాలాంటి సభ్యులకు తమ సహకారము అందగలదని ఆశిస్తూ నా శుభకాంక్షలను మరల తెలియచేస్తున్నాను. 12-30 p.m.

మిస్టర్ స్పీకర్:—స్నేహితులారా, ఈ ఏడవ శాసనసభ సభాధ్యక్షుడిగా నన్ను ఏకగ్రీవముగా ఎన్నుకొన్నందుకు గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి ప్రతిపక్ష నాయకులకు, గౌరవ సభ్యులందరకూ నా హృదయపూర్వక ధన్యవాదములు. నేను వినమ్రతతో, పవిత్ర హృదయముతో త్రికరణశుద్ధిగా ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను అనేక మంది మిత్రులు విజ్ఞులు, ప్రాజ్ఞులు, చాల సలహాలు, సూచనలు చేశారు. వాటన్నింటిని దృష్టిలో పెట్టుకొని సభాకార్యక్రమాలను నిర్వహిస్తాను అని సభ్యులకు హామీ యిస్తున్నాను. ప్రతిపక్షము, పాలకపక్షము అనే భేదము లేకుండా న్యాయము కలిగే పద్ధతిలో అందరికి రక్షణ కల్పిస్తాను అని మనవిచేస్తున్నాను. నేను ఈ సభాకార్యక్రమాలను నిర్వహించటములో సభ్యు

లందరూ తమ సహకారాన్ని యివ్వాలని మనవిచేస్తున్నాను. సభాకాలము చాల అమూల్యమైయినది. అనేక సమస్యలుంటాయి. మనకు వున్న సమయములో ఆ సమస్యలను ప్రభుత్వదృష్టికి తీసుకొనిరావడానికి వినియోగించుకోవడము మంచిదని భావిస్తున్నాను. ఆంధ్రుల అభ్యున్నతికి కృషి చేయాలనే లక్ష్యములో ఎటువంటి సందేహము లేదు. ఏ పార్టీవారయినా కాని వారి ప్రోగ్రామ్స్ ఏవైనా కాని లక్ష్యము ఒకటే. ఆంధ్రుల అభ్యున్నతికి అంకితము కావాలనే దృష్టితో వ్యవహరించాలని, ఆవేశాలకు తావు యివ్వక శాంతియుతమైన వాతావరణములో చర్చలు జరుపుకొని సమస్యలను పరిష్కరించుకొనడానికి ప్రయత్నము చేద్దాము. సభ్యులందరూ ఈ శాసన సభలో హుందాగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాను. సభా హుందాతనాన్ని కాపాడటానికి నేను ప్రయత్నము చేస్తాను. ఆంధ్రప్రదేశ్ విధానసభకు ఒక ప్రత్యేకత వుందని గౌరవనీయులైన అనేకమంది పెద్దలు చెప్పివున్నారు. హుందాతనముగా ఇంతకుముందున్న సభాధ్యక్షులు సభా కార్యక్రమాలను నిర్వహించినమాదిరే నేనుకూడ సభ హుందాతనమును మెయింటెయిన్ చేస్తానని మనవి చేస్తున్నాను. శాసన సభ్యులు కూడ తమ విద్యుక్తధర్మాన్ని నిర్వహిస్తే సభా కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ధర్మో రక్షతి రక్షితః, ఏ ధర్మము రక్షించబడుతుందో అదే ధర్మము మనలను రక్షిస్తుంది. శాసన సభ్యులు తమ తమ విద్యుక్త ధర్మమును నిర్వహించిననాడు అదే ధర్మము మనందరను రక్షిస్తుందని తెలియజేస్తూ మీ అందరకు నా ధన్యవాదాలు మరొకసారి తెలియజేస్తూ శలవు తీసుకుంటున్నాను.

## ANNOUNCEMENTS

Mr. Speaker:—I am to announce to the House that Sri N.T. Rama Rao, member elected from Tirupathi and Gudivada Assembly Constituencies has resigned his seat from the Tirupathi Constitueney, with effect from today.

II. I am also to announce to the House that Sri K. Vijaya Bhaskara Reddy member elected from the Yemmiganur Assembly Constituencey has resigned his seat with effect from the 16th January, 1983.

III. I am to announce to the House that I have nominated the following Members to be on the Business Advisory Committee under my Chairmanship:

1. Sri N.T. Rama Rao, Chief Minister
2. Sri N. Bhaskara Rao, Minister for Finance
3. Sri Y.Ramakrishnudu, Minister for Law & Municipalities
4. Sri Areti Kotaiah
5. Sri A. Madan Mohan

6. Sri. Y. S. Rajasekhara Reddy
7. Sri. M. Omkar
8. Sri Md. Rajab Ali
9. Sri N. Chandrasekehara Reddy
10. Sri Katuri Narayana Swamy

The following members will be the Special invitees:

1. Sri Sultan Salahuddin Owaisi
2. Sri M. Venkaiah Naidu
3. Sri S. Jaipal Reddy

There will be a meeting of the Business Advisory Committee in my Chambers soon after the adjournment of the House now. I request the members to attend the meeting.

The Members are aware that Governor will address Members of the Assembly and Council assembled together at 4-00 p m. to-day.

12-38 p.m. The House now stands adjourned to meet again at 8-30 A.M. on Wednesday, the 19th January, 1983.

The House then adjourned.